సిట్ సోదాలు

- మద్యం కుంభకోణం దర్యాప్తులో భాగంగా నర్రెడ్డి సునీల్‌రెడ్డి కార్యాలయాల్లో తనిఖీలు

మద్యం కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు గురువారం నగరంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి వ్యాపారపరంగా అత్యంత సన్నిహితుడైన నర్రెడ్డి సునీల్‌రెడ్డికి చెందిన రెండు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. - మెయిన్‌లో


సునీల్‌రెడ్డి కార్యాలయాలు ఉన్న భవనం



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, తదితరులు

స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

- ప్లాంటును పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలి
- కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

గాజువాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి విశాఖ స్టీల్‌ప్లాంటు తలమానికంగా ఉందని, అటువంటి ప్రతిష్టాత్మకమైన కర్మాగారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నాయని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి అన్నారు. స్టీల్ ప్లాంటులో ఈవోఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్)లను నిరసిస్తూ గురువారం పాతగాజువాక జంక్షన్ నుంచి కొత్తగాజువాక వరకూ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పాతగాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో బేబి మాట్లాడుతూ దేశంలో నాణ్యమైన ఉక్కు ఉత్పత్తిలో విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రథమ స్థానంలో ఉందన్నారు. అంతటి ప్రతిష్టాత్మకమైన ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ప్లాంటును కేంద్రం అమ్మాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోలేదని ఆరోపించారు. గతంలో ప్రైవేటీకరణ అయిన సంస్థల పరిస్థితి నేడు ఎలా ఉందో రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముందుకు రావాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ప్రభుత్వ రంగంలోనే ... మిగతా 6వ పేజీలో


సభలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

ఆహారం లేక అవస్థలు

కంటి మీద కునుకు లేదు

భయంభయంగా గడిపాం

- రాష్ట్ర ప్రభుత్వ స్పందన ప్రశంసనీయం
- మంత్రి లోకేశ్ అనుక్షణం మా యోగక్షేమాలు తెలుసుకున్నారు
- ఇచ్చిన మాట ప్రకారం ఒక్కరోజులోనే స్వస్థలానికి చేర్చారు
- విశాఖ చేరుకున్న నేపాల్ యాత్రికులు

"ఎటు చూసినా అల్లర్లు...కాలిపోతున్న భవనాలు... నీరు, ఆహారం లేదు. బతికుంటామనే భరోసా లేదు. మూడు రోజులు కంటి మీద కునుకులేకుండా భయం భయంగా గడిపాం. మా వేదనను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు ప్రశంసనీయం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అనుక్షణం మాయోగ క్షేమాలు తెలుసుకున్నారు. మాతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారు. క్షేమంగా రాష్ట్రానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం ఒక్కరోజులోనే ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి, స్వస్థలాలకు చేర్చారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాం...."

- నేపాల్ పర్యటనకు వెళ్లి అల్లర్లలో చిక్కుకుపోయిన రాష్ట్ర వాసులు గురువారం క్షేమంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న తరువాత చెమర్చిన కళ్లతో చెప్పిన మాటలివి...


నేపాల్ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న యాత్రికులు

గోపాలపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్ అల్లర్లలో చిక్కుకుని గురువారం క్షేమంగా నగరానికి చేరుకున్న బాధితుల ముఖాల్లో ఆనందం కాంతులీనింది. మూడు రోజులుగా నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో చిక్కుకున్న బాధితులు ఆకలిదప్పులతో ఇబ్బందులు పడ్డారు. తమను సురక్షితంగా తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో అహర్నిశలు శ్రమించిన ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు చెమర్చిన కళ్లతో కృతజ్ఞతలు తెలిపారు.


విమానాశ్రయంలో నేపాల్ యాత్రికులు

చంద్రబాబు కృషితో క్షేమంగా చేరాం



పది మంది కలిసి ఈ నెల 3న నేపాల్ యాత్రకు వెళ్లాం. అక్కడ కొన్ని ఆలయాలు దర్శించుకుని పోఖరాలోని ఓ హోటల్‌లో బస చేశాం. అక్కడి నుంచి మరో ఆలయ దర్శనానికి వెళ్లినప్పుడు అల్లర్లు చెలరేగాయి. తిరిగి వచ్చేసరికి మేము బసచేసిన హోటల్‌కు నిప్పంటుకుంది. మా సామగ్రి అంతా హోటల్‌లోనే ఉండిపోయింది. నగరానికి ఎలా చేరుకోవాలో తెలియక ఆందోళన చెందాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ కృషితో క్షేమంగా చేరాం. జీవితాంతం చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

- మద్దుల ఆశారాణి, గోపాలపట్నం

మాకు పునర్జన్మే..



విజయనగరం నుంచి 39 మందిమి నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడి అల్లర్లలో చిక్కుకున్నాం. మూడు రోజులు ఆహారం కూడా లేక అవస్థలు పడ్డాం. కళ్ల ముందు జరుగుతున్న మారణకాండ చూసి భయాందోళనకు గురయ్యాం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో సురక్షితంగా చేరుకున్నాం. మాకు పునర్జన్మ కల్పించిన చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు.

- కర్రి శ్రీనివాసరావు, విజయనగరం

ప్రభుత్వ సేవలు అభినందనీయం



నగరం నుంచి 61 మంది నేపాల్ యాత్రకు వెళ్లి అల్లర్ల కారణంగా చిక్కుకుపోయాం. ఇంటికి ఎలా చేరాలో తెలియక తీవ్రంగా ఆందోళన చెందాం. మమ్మల్ని స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి, సేవలు అభినందనీయం. ప్రభుత్వ పనితీరుకు సర్వదా కృతజ్ఞతలు. నేరుగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఒక్క రోజులో క్షేమంగా ఇంటికి తీసుకువచ్చారు.

- ఎస్‌వీ రామరాజు, రామాటాకీస్ ప్రాంతం

ఇంత త్వరగా వస్తామనుకోలేదు



నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న మేము సురక్షితంగా, ఇంత తొందరగా రాష్ట్రానికి చేరుకుంటామనుకోలేదు. బాధితుల్ని స్వస్థలాలకు తీసుకురావడానికి ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయం. ప్రభుత్వం తీసుకున్న చొరవ జీవితాంతం మరువలేనిది. మమ్మల్ని సురక్షితంగా ఇళ్లకు చేరుస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

- రోజారాణి, కాకినాడ

నిర్వహణ లోపం.. ఉక్కుకు శాపం

యాజమాన్యం నిర్లక్ష్యం

- విభాగాల్లో మరమ్మతులు చేపట్టకుండా కాలయాపన
- మేల్కొనకపోతే ప్రాణాలకే ముప్పు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు యాజమాన్యం వివిధ విభాగాల నిర్వహణ పనులను గాలికి వదిలేసింది. కొన్ని విభాగాల్లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రాణాంతకమైన వాయువులు లీక్ అవుతున్నాయని అక్కడ ఏర్పాటుచేసిన రెడ్ సిగ్నల్లు వెలుగుతున్నా స్పందించడం లేదు. అత్యంత కీలకమైన బ్లాస్ట్ ఫర్నేస్ ట్యాంకులు, కూలింగ్ టవర్‌లు శిథిలావస్థకు చేరుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. రామెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ)లో కన్వేయర్లు పనిచేయడం లేదని రెండు నెలలుగా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

కన్వేయర్లపై షెడ్‌ల రేకులు ఊడిపోయాయి. వర్షం పడినప్పుడల్లా ఆ ఖాళీల్లో నుంచి నీరు కన్వేయర్లపై పడి ముడి పదార్థాలు తడిసి ముద్దగా మారుతున్నాయి. దాంతో బెల్ట్‌లు ఆగిపోతున్నాయి. వీటి నిర్వహణకు కూడా యాజమాన్యం నిధులు కేటాయించడం లేదు. స్టీల్‌ప్లాంటులో ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు కచ్చితంగా చేపట్టాలి. అయితే కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తగ్గించడం వల్ల ఆ పనులన్నీ నిలిచిపోయాయి. దాంతో ఎక్కడికక్కడ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



ఎల్‌డీ గ్యాస్ ద్రవరూపంలో లీకవుతున్న దృశ్యం


ఆర్‌ఎంహెచ్‌పీ కన్వేయరు బెల్ట్ పైన పైకప్పు రేకులు పాడైన దృశ్యం


ఎల్‌డీ గ్యాస్ లీకవుతున్నదని రెడ్ లైట్ ఇండికేషన్

ప్రమాదకరంగా బ్లాస్ట్ ఫర్నేస్-3

బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రమాదకరంగా మారింది. ఇక్కడ హాట్ మెటల్‌తో పాటు స్లాగ్ (బూడిద) వస్తుంది. దానిని గ్రాన్యులేషన్ ట్యాంకుల్లోకి తీసుకొని నీటిని పంపించి స్లర్రీ స్లాగ్‌గా మారుస్తారు. అయితే గ్రాన్యులేషన్ ట్యాంకులు రంధ్రాలు పడి శిథిలావస్థకు చేరాయి. లోపల అంతా తుప్పు పట్టేశాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియదు. వాటిని తీసేసి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ పట్టించుకోవడం లేదు. బ్లాస్ట్ ఫర్నేస్ కూలింగ్ టవర్లకు సంబంధించిన సిమెంట్ స్ట్రక్చర్లు కూడా బీటలు వారిపోయాయి. వాటికీ మరమ్మతులు చేయడం లేదు.

ఎల్‌డీ గ్యాస్ లీకేజీ

స్టీల్ తయారీలో భాగంగా లింజ్-డోనవిట్జ్ (ఎల్‌డీ) గ్యాస్ విడుదల అవుతుంది. దానిని రికవరీ ప్లాంట్ల ద్వారా కలెక్ట్ చేసి రోలింగ్ మిల్స్ నడపడానికి ఉపయోగిస్తారు. ఈ గ్యాస్ చాలా ప్రమాదకరమైనది. గాలి కంటే బరువైనది. రంగు, వాసన ఉండవు. త్వరగా మండుతుంది. అత్యంత విషపూరితమైనది. ఇందులో ఎక్కువగా కార్బన్ మోనాక్సైడ్ ఉంటుంది. దాంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఉంటాయి. ఈ గ్యాస్ లీకయ్యే ... మిగతా 6వ పేజీలో

పరిశ్రమల కోసం ల్యాండ్ బ్యాంకు

రెండు నుంచి మూడు వేల ఎకరాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం నిర్ణయం

- ఆనందపురం, పద్మనాభం మండలాలపై దృష్టి
- ప్రభుత్వ భూముల వివరాల సేకరణ
- ఐటీ, ఐటీయేతర పరిశ్రమలకు కేటాయింపు కోసమే...



విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఐటీ, ఐటీయేతర పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను సిద్ధం చేసుకోవాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. తొలుత రెండు నుంచి మూడు వేల ఎకరాలను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ప్రభుత్వ భూములను పారిశ్రామిక అవసరాలకు కేటాయించాలని భావిస్తోంది.

జిల్లాలో గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి మండలాల్లో కొంతమేర ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ... ఐటీ, ఇతర మౌలిక వసతుల కల్పన సంస్థలు అటువైపు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. నగరానికి ఉత్తరాన ఎక్కువగా అభివృద్ధి జరుగుతున్నందున పరిశ్రమలు కూడా ఆనందపురం, పద్మనాభం వైపు మొగ్గుచూపుతున్నాయి. విశాఖ రూరల్, భీమిలి మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో చాలావరకూ ఇప్పటికే ఐటీ కంపెనీలకు కేటాయించారు. భీమిలి మండలం కాపులుప్పాడలో సుమారు రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో కొండలను గతంలో ఒక సంస్థకు కేటాయించారు. ఆ సంస్థ కొంత మొత్తం ప్రభుత్వానికి చెల్లించింది. అయితే అక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో ప్రభుత్వం రద్దు నోటీస్ ఇవ్వగా...సంస్థ కోర్టుకు వెళ్లింది. ఈ వ్యాజ్యంపై ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఆ భూములు అందుబాటులోకి వచ్చి అనేక కంపెనీలకు కేటాయించవచ్చు. ఇందుకు సమయం పడుతుంది. అందువల్ల జిల్లా యంత్రాంగం ఆనందపురం, పద్మనాభం మండలాలపై దృష్టిపెట్టింది. ఆనందపురం మండలం జగన్నాథపురంలో గతంలో గ్రేహౌండ్స్‌కు సుమారు 350 ... మిగతా 6వ పేజీలో

మరో పరీక్షా కేంద్రానికి అనుమతి!

- మారని ఏయూ దూర విద్య కేంద్రం అధికారులు తీరు
- ఉన్న సెంటర్లు కుదించాలని యోచిస్తున్న ఉన్నతాధికారులు
- గుట్టుగా మరో కళాశాలకు గ్రీన్‌సిగ్నల్

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూరవిద్య కేంద్రాన్ని ప్రక్షాళన చేయాలని భావిస్తున్న ఉన్నతాధికారుల లక్ష్యానికి విరుద్ధంగా కిందిస్థాయిలో కొందరు నిర్ణయాలు తీసుకుంటున్నారు. దూరవిద్య పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగు తోందంటూ 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. కొన్ని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదే విధంగా పరీక్షా కేంద్రాలను, ప్రాక్టికల్ సెంటర్లను ప్రభుత్వ కాలేజీల్లో మాత్రమే ఏర్పాటుచేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఇకపై కొత్తగా పరీక్షా కేంద్రాలను మంజూరు చేయ కూడదని, ఉన్నవాటినే కుదించాలని ఆలోచిస్తుంటే... కిందిస్థాయి అధికారులు కొద్దిరోజుల కిందట గుట్టు చప్పుడు కాకుండా విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజక వర్గంలోని జామిలో ఒక కాలేజీకి పరీక్షా కేంద్రంగా అవకాశాన్ని కల్పించినట్టు తెలిసింది. సదరు కాలేజీలో కనీస స్థాయిలో మౌలిక వసతులు లేవని చెబుతున్నారు. పరీక్షా కేంద్రంతోపాటు అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. దీనివల్ల రానున్న రోజుల్లో అక్కడి నుంచి అడ్మిషన్లు జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మళ్లీ ప్రాక్టికల్ సెంటర్ కూడా మంజూరు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. అయితే దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. ఇదిలావుంటే దూరవిద్య కోర్సుల ప్రవేశాలు ... మిగతా 6వ పేజీలో



స్మార్ట్ రైస్ కార్డులు 75 శాతం పంపిణీ

- అగనంపూడికి రైతుబజార్ మంజూరు
- ఆరిలోవలో బజార్ త్వరలో ప్రారంభం
- ఎండాడ, పీఎం పాలెంలలో రైతుబజార్ల ఏర్పాటుకు స్థలాలు గుర్తింపు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల బియ్యం కార్డుదారుల్లో 75 శాతం మందికి కొత్తగా ముద్రించిన స్మార్ట్ కార్డులు పంపిణీ చేసినట్టు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోల వారీగా కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ కార్డులు తీసుకోని వారంతా సమీపంలో గల రేషన్ డిపోలకు వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. ఇంకా http://epds1.ap.gov.in,epdsAP/epds/rationcard search.epds..కు వెళ్లి బియ్యం కార్డు వివరాలు నమోదుచేస్తే ఏ డిపోలో కార్డు ఉందో తెలుస్తుందన్నారు. సందేహాలుంటే జిల్లా పౌరసరఫరాల శాఖ లేదా సహాయ పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రతించాలన్నారు. అగనంపూడికి రైతుబజార్ మంజూరైందని, ఏర్పాటు కోసం 50 సెంట్ల ప్రభుత్వ స్థలం గుర్తించామన్నారు. ఆరిలోవలో ఇప్పటికే నిర్మించిన రైతుబజార్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మించామన్నారు. త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఎండాడ, పీఎం పాలెంలలో రైతుబజార్ల ఏర్పాటుకు స్థలాలు గుర్తించామని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు. పెందుర్తి పరిసరాల్లో రైతుబజార్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం గుర్తించాలని అధికారులకు సూచించామని జేసీ తెలిపారు. ఇళ్ల పట్టాల కోసం అర్హులైన పేదలు సమీపంలో సచివాలయాల్లో దరఖాస్తుచేసుకోవచ్చునని పేర్కొన్నారు.



గోవిందరాజస్వామికి గరుడ పూజ చేస్తున్న అర్చకుడు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణలు జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. అలాగే ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి, నారసింహ అష్టోత్తర శతనామార్చన చేశారు. మంగళవాయిద్యాల నడుమ గోవిందుడి చుట్టూ భక్తులు ముమ్మారు ప్రదక్షిణలు జరిపారు.

వ్యవసాయ సహాయకురాలికి సన్మానం



స్వాతిని సత్కరిస్తున్న గ్రామస్తులు, అధికారులు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు సచివాలయం గ్రామ వ్యవసాయ శాఖ సహాయకురాలు (ఏఈఓ) బి. స్వాతికి పదోన్నతి లభించింది. ఈమేరకు గురువారం గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది, భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ విజయప్రసాద్, ఏఓ కోమలి ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్నాళ్లు ఆమె రైతులకు చేసిన సేవలను అధికారులు కొనియాడారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'అవంతి' విద్యార్థి ప్రతిభ



మణికంఠను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి

తగరపువలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సారిక మణికంఠ రాష్ట్రస్థాయి హైజంప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. ఈపోటీలు చీరాలలో ఈనెల 6న జరిగాయి. ఈమేరకు విద్యార్థిని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ డైరెక్టర్ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ రోడ్డు ..నడక దారే

తగరపువలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని దుర్గాలమ్మ గుడికి వెళ్లే రహదారి నడక దారేనని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతోమంది నివాసితులకు నడక దారిగా ఉన్న ఈ రహదారిని కొంతమంది ఆక్రమించి, తమ జిరాయితీ భూమిగా చెప్పి, మూసివేశారు. ఈవిషయమై స్థానికులు ఈనెల 8న రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాళ్లవలస వీఆర్ఓ, సంగివలస సర్వేయర్ గ్రామ సర్వే నంబరు 24.7, 24.9లో సర్వే చేసి రికార్డుల్లో తాడిపత్రి జనార్దనస్వామి, చిల్ల కన్నయ్య పేర్లతో అనుభవదారులుగా ఉన్నాయని, కానీ రికార్డుల్లో నడకదారిగా ఉందని స్పష్టం చేశారు. ఈమేరకు అది నడక దారిగా తహశీల్దార్ రామారావు చెప్పారు.

పుష్కరిణి మండపంపై మొక్కలు



మండపం మీద మొలిచిన మొక్కలు

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి కొండ దిగువ వరాహ పుష్కరిణిలో ఉన్న మండపంపై మొక్కలు మొలుస్తున్నాయి. పుష్కరిణిలో భక్తులు నిత్యం స్నానాలు ఆచరించడంతో పాటు ఏడాదిలో ఒకసారి పుష్యమాస బహుళ అమావాస్యనాడు అప్పన్న స్వామికి దేవేరులతో కలిపి తెప్పోత్సవం కూడా జరుపుతారు. ఉత్సవంలో భాగంగా స్వామివారిని మండపంలో ఉంచి పూజలు చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మండపం మీద మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వాటిని సకాలంలో తొలగించకుంటే పుష్కరిణి ఈశాన్య దిక్కులోని మరో మండపం మాదిరిగానే ఈ ప్రధాన మండపం కూడా కూలిపోయే ప్రమాదం ఉంది. దేవస్థానం అధికారులు స్పందించి మండపం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

క్వాంటం టెక్నాలజీతో అనేక ప్రయోజనాలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం టెక్నాలజీ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రముఖ క్వాంటం టెక్నాలజీ నిపుణుడు, క్విన్‌ఫోసిస్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.మహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. క్వాంటం టెక్నాలజీ వినియోగం భవిష్యత్తులో ప్రతి రంగంలో పెరుగుతుందని, యువత అందుకు తగ్గట్టుగా లోతైన పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

తగరపువలస పీఏసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తగరపువలస ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ముగ్గురు సభ్యులతో కూడిన అనధికార కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ ఛైర్పర్సన్‌గా పీజీకే వర్మ, పర్సన్లు గా పొట్నూరు రాము, నమ్మి సత్యారావును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ కాలపరిమితి 2026 జనవరి 30వతేదీగా నిర్ణయించిన ప్రభుత్వం ఈలోగా ఎన్నికలు జరిగితే కమిటీ రద్దవుతుందని పేర్కొంది.

అర్హులైన రైతులకు న్యాయం చేస్తాం

- ప్రభుత్వ అవసరాల నిమిత్తమే అన్నవరంలో భూసేకరణ
- స్వాధీనం చేసుకున్న భూములన్నీ ప్రభుత్వానివే
- సాగుదారుల వద్ద ఎటువంటి ఆధారాలు లేవు
- కావాలనే కొందరు యాగీ
- నిజమైన అర్హత ఉంటే తప్పకుండా ఆదుకుంటాం
- ఆర్‌డీఓ సంగీత్ మాథూర్



ఆర్డీవో సంగీత్ మాథూర్

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం గ్రామంలో ప్రభుత్వ అవసరాల నిమిత్తమే భూసేకరణ చేపడుతున్నామని ఆర్‌డీఓ కె. సంగీత్ మాథూర్ అన్నారు. భూములు కోల్పోయిన వారిలో నిజమైన అర్హులు ఉంటే తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సాగుదారుల నుంచి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవడం లేదన్నారు. 2023లోనే గ్రామంలో సర్వే నంబరు 101లో ఉన్న భూములను పర్యాటక శాఖకు అప్పగించారని చెప్పారు. మొదటి విడతగా 80 ఎకరాలు, తర్వాత పద్దెనిమిదిన్నర ఎకరాలతో కలిపి మొత్తం తొంబై ఎనిమిదిన్నర ఎకరాలు ఆ శాఖకు అప్పగించామన్నారు. సంబంధిత స్థలాన్ని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 2005లో అప్పగించామని, ఏవిధమైన అభివృద్ధి చేయకపోవడంతో అది రద్దు చేసి, పర్యాటక శాఖకు అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం అప్పగించిందన్నారు. ప్రస్తుతం ఆ భూములను పర్యాటక శాఖ అభివృద్ధి చేయడానికి ఉపక్రమించగా ఆ భూమిని సాగు చేస్తున్న 28 మంది రైతులు వచ్చి అడ్డుపడుతున్నారని తెలిపారు. భూమిని సాగుచేసుకుంటున్నట్టు వారి వద్ద ఏవిధమైన ఆధారం ఉన్నా.. తగిన న్యాయం చేస్తామని చెప్పారు. కానీ వారు కాంప్రిహెన్సివ్ ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఎల్‌డీపీ) 2006లో తమకు అనుమతి పత్రాలు ఇచ్చారని చెబుతున్నారన్నారు. సీఎల్ డీపీ ప్రోగ్రామ్‌ను డ్వామా అధికారులు కొన్ని ప్రాంతాల్లో అమలుచేశారని, నిరుపేద కుటుంబాలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి, వారి జీవనోపాధికి మొక్కలు అందించి, ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుని, ఫలసాయాన్ని అనుభవించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసుకునే అవకాశం డ్వామా కల్పిస్తారు తప్ప ఆ భూ మిపై లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు ఇచ్చే అధికారం వారికి లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని ఆందోళనకా రులకు సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ భూమిని ఒక మహిళా రైతు పేరుతో జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ) అన్‌రిజిస్టర్డ్ రాయడం కూడా నేరమన్నారు. 1979 నుంచి సంబంధిత సర్వే నంబరులో ఎక్కడెక్కడ పంటల సాగు జరిగిందన్న విషయాన్ని ప్రభుత్వం శాటిలైట్ ఇమేజస్ ద్వారా సేకరించిందన్నారు. ఆందోళన చేస్తున్న వారి ఆధార్‌కార్డులు కూడా కొందరు అన్నవరం సమీపంలోని పైలపేట గ్రామంలోను, మరి కొందరు విజయనగరం, విశాఖలో ఉన్నట్లు తెలుస్తుందన్నారు. వారు ఆ భూమిలో సాగు చేసిన దాఖలాలు లేవన్నారు. సంబంధిత భూమిలో 2020 నుంచి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేస్తుందన్నారు. అపుడు రైతులెవరూ రాలేదని చెప్పారు. ఇప్పటికైనా వారి వద్ద ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆటోడ్రైవర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆటోడ్రైవర్లు, వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకంతో రోడ్డున పడిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు.చాలీచాలని ఆదాయంతో పిల్లల స్కూల్ ఫీజు కట్టలేక, ఆటో అద్దెలు, ఇంటి అద్దెలు చెల్లించలేక దయనీయ స్థితిలో ఉన్నారని తెలిపారు. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవో నంబరు 21, 31 అమలు చేసి వేలాది రూపాయల జరిమానాలు విధిస్తున్నాయని, లేబర్ ట్యాక్స్ గ్రీన్ ట్యాక్స్ పేరుతో ఛార్జీలు కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి నెలా ఆటో కార్మికులకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ గ్యాస్‌లపై 50 శాతం రాయితీ ఇవ్వాలని, చలానా కేసులను ఎత్తివేయాలని, భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి జిల్లాలోనూ పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, డ్రైవర్ ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు, సహజ మరణం జరిగితే రూ. 5 లక్షలు అందించాలన్నారు. అనంతరం వారు ఆర్‌డీఓ సంగీత్ మాథుర్‌కు వినతిపత్రం అందించారు. కాగా తొలుత ఆటో కార్మికులు తగరపువలస నుంచి ఆటోలతో ర్యాలీగా పట్టణానికి వచ్చారు. బీచ్ రోడ్‌లో వున్న ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మోర అప్పలరాజు, సీపీఐ నాయకుడు కె. సందీప్, నూకరాజు, గురుమూర్తి, ధనరాజ్, శివ, చిన్నారావు, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ



వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ సురేశ్

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు సాగించాలని గోపాటపట్నం ట్రాఫిక్ సీఐ కె. సురేశ్ సూచించారు. గురువారం ఆయన పాతగోశాల కూడలి వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-2 ఏఎంహెచ్‌ఓగా రాజా రవికుమార్



ఐదో వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రాజా రవికుమార్

కొమ్మాది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 ఏఎంహెచ్‌ఓగా రాజారవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెదబయలు మండలంలో యానిమల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.గతంలో ఇక్కడ ఏఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ కిశోర్ విజయవాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేశారు. కాగా నూతన ఏఎంహెచ్‌ఓ బాధ్యతలు చేపట్టిన తరువాత 5వ వార్డులో పర్యటించారు. శానిటేషన్ సమస్య ఎక్కడా కనిపించకూడదని, ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అలాగే దోమలు విజృంభించకుండా ఫాగింగ్ చేయాలని చెప్పారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే అదితి



కప్ప స్తంభం వద్ద అదితి విజయలక్ష్మీ

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతి వరాహలక్ష్మీనృసింహ స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత ఆమె గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

సాగర్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో మొగధారమ్మ ఆలయం సమీపంలో గురువారం ఉదయం కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో నలుగురు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. కారు బీచ్ రోడ్డులో రుషికొండ వైపు వేగంగా దూసుకువస్తూ మొగధారమ్మ ఆలయం సమీపంలో అదుపు తప్పింది. ముందుభాగం పూర్తిగా పాడైంది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన సమయంలో బీచ్ రోడ్డులో ఎవరూ సంచరించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పీజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను పీజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీ పీజీ సెట్ 2025లో అర్హత సాధించిన వారు ఈనెల 15వ తేదీలోగా కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 8179780917 సెల్ నంబరులో సంప్రతించాలని ఆమె సూచించారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన యడ్లపాటి శశికిరణ్ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ప్రజాసంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి ప్రసన్నలక్ష్మికి గురువారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబానికి అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలను, ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న చిన్నశ్రీను ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, పద్మనాభం మండలం రేవిడి వెంకటాపురం గ్రామానికి చెందిన జట్టు ద్వితీయ స్థానం, అదే మండలానికి చెందిన రేవిడి కింగ్స్ తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 15 వేలు చొప్పున నగదు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, షణ్ముఖరావు, మధునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'డైట్'లో ఘనంగా కళా ఉత్సవ్



నృత్యంలో మొదటి బహుమతి పొందిన నడుపూరు విద్యార్థులు

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) లో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్ గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె. చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధే ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం ఏటా కళా ఉత్సవ్ నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల్లో కళాత్మక ప్రతిభను వెలికితీసే అద్భుతమైన వేదిక కళాఉత్సవ్ అని చెప్పారు. అనంతరం రెండు రోజుల పాటు జరిగే ఉత్సవ్‌లో భాగంగా మొదటి రోజు పాటల పోటీ, నృత్య ప్రదర్శన, మ్యూజిక్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 45 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 80 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. వాయిద్యం సోలో విభాగంలో కాశీపురం విద్యార్థి టి. రఫీ, అరిపాక విద్యార్థి ఎస్. ప్రణీత్‌కుమార్ మొదటి రెండు స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో నడుపూరు హైస్కూల్ ప్రథమ, భీమిలి పీఏస్ఎంఈ జీవీఎంసీ స్కూల్ ద్వితీయ, హెచ్‌సీ వెంకటాపురం తృతీయ స్థానాల్లో నిలిచాయి. పాటల పోటీలో సోలో విభాగంలో విశాఖ విశ్వదయ హైస్కూల్ విద్యార్థిని ఐ. కృష్ణలేఖ, విశాఖ గాయత్రి కళాశాల విద్యార్థిని ఎం. సత్య నిఖిత, ఎస్. స్నేహిత మొదటి మూడు స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో థెరిస్సా స్కూల్ పీఎంపాలెం, నడుపూరు జడ్పీహెచ్ఎస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం నక్కపల్లి పాఠశాలలు గెలుపొందాయి. నృత్యం సోలో విభాగంలో ఎం.లాస్య (శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్), సీహెచ్ హాశ్విత (శ్రీచైతన్య ద్వారకానగర్), పి. ప్రియాంక సామల్ (జడ్పీహెచ్ఎస్ నడుపూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో నడుపూరు జడ్పీహెచ్ఎస్, కాపులుప్పాడ శ్రీప్రకాశ్, కాశీపురం జడ్పీహెచ్ఎస్ విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందినవారు నవంబర్‌లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నాయకులతో వెంకటరమణ, అతని కుటుంబ సభ్యులు

నేపాల్ నుంచి క్షేమంగా ఇంటికి

- సింహాచలం యాత్రికుడు వెంకటరమణ

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో రెండు రోజుల పాటు ఉత్కంఠభరితమైన వాతావరణం నుంచి బయటపడి స్వగృహానికి చేరడం ఆనందంగా ఉందని సిరిపురపు వెంకటరమణ అన్నారు. ఈనెల 5వ తేదీన ఆయన తన భార్య రమ, మరో కుటుంబ సభ్యురాలు సత్యవతితో కలిసి నేపాల్‌లో పుణ్యక్షేత్రాల యాత్రకు వెళ్లారు. 8వ తేదీ వరకు యాత్ర సజావుగానే జరగ్గా 9వ తేదీ నుంచి పరిస్థితులు అదుపు తప్పాయి. ఖాట్మండ్‌లో అద్దెకు దిగిన వసతి గృహం యజమాని పెద్ద మనసుతో చాలావరకు సహకరించారని వెంకటరమణ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విమానం ఏర్పాటు చేసిన తరువాత లాడ్జి నుంచి విమానాశ్రయానికి తన సొంత వాహనంలో లాడ్జి యజమాని పంపించారన్నారు. 9, 10 తేదీల్లో చాలా ఆందోళనకు గురయ్యామని, తామున్న ప్రాంతాన్ని కార్పొరేటర్ పివి నరసింహంకు ఫోన్ ద్వారా షేర్ చేశానని చెప్పారు. కార్పొరేటర్ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు చేరవేయడంతో ఇతరులతో పాటు తాము కూడా స్వస్థలానికి క్షేమంగా చేరుకోగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. తమకు అన్నివిధాలా సహకరించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విశాఖ విమానాశ్రయం నుంచి సింహాచలంలోని స్వగృహానికి చేరిన వెంకటరమణ కుటుంబ సభ్యులను కార్పొరేటర్ నరసింహం, వార్డు టీడీపీ నాయకులు పంచదార్ల శ్రీనివాస్, గుసిడి అవినాష్‌బాబు కలిసి పలు విషయాలను వాకబు చేశారు. వారితో పాటు విమానాశ్రయం నుంచి పద్మావతినగర్‌కు చెందిన మరో జంట కూడా వచ్చారు.

గ్రామ కంఠం భూములకు రిజిస్ట్రేషన్లు చేయాలి

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని అడివివరం, విజినిగిరిపాలెం, సింహాచలం గ్రామ కంఠాల భూములకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. గురువారం ఆయన 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచలం దేవస్థానంతో ముడిపడిన పంచ గ్రామాల్లో వేపగుంట, చీమలాపల్లి, పురుషోత్తపురం,వెంకటాపురంలో రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అడివివరం గ్రామ కంఠం భూములకు మాత్రమే రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం సరికాదని చెప్పారు. గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణమే రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

ఉపాధి అవకాశాలు వస్తాయని, ప్రైవేటు రంగంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంటు విషయంలో ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్మిక సంఘ నాయకుడు జె.అయోధ్యరాం, యు. రామస్వామి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం ల్యాండ్ బ్యాంకు

... 5వ పేజీ తరువాయి

ఎకరాలు కేటాయించారు. అయితే కొత్తవలస సమీపాన రెల్లి గ్రామంలో గిరిజన వర్సిటీకి గుర్తించిన భూముల్లో గ్రేహౌండ్స్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతో జగన్నాథపురంలో 350 ఎకరాలతోపాటు అక్కడే ఉన్న కొండ ప్రాంతాన్ని పరిశ్రమలకు కేటాయించేందుకు అవకాశం ఉంది. అలాగే గిడిజాల, రామవరం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, కణమాం, తదితర పంచాయతీల్లో ప్రభుత్వానికి చెందిన భూములతో పాటు కొండల వివరాలను సేకరిస్తున్నారు. ఆ ప్రక్రియ ముగిసిన తరువాత ఇక్కడకు వచ్చే సంస్థలకు భూములు కేటాయించనున్నారు. ఇదిలావుండగా రాష్ట్ర ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ బుధవారం నగరానికి వచ్చి ఐటీ సంస్థలకు భూముల కేటాయింపుపై జిల్లా అధికారులతో చర్చించారు. కంపెనీల నుంచి వచ్చే ప్రతిపాదనల మేరకు సాధ్యమైనంత వేగంగా భూములు కేటాయించాల్సి ఉంటుందన్న సూచన మేరకు అధికారులు ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ లోపం.. ఉక్కుకు శాపం

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో 15 నిమిషాలు ఉంటే కళ్లు తిరిగి పడిపోతారు. వాంతులు అవుతాయి. అంతకంటే ఎక్కువ సమయం ఉంటే ప్రాణాపాయం కలుగుతుంది. ఈ గ్యాస్‌కు 12 సీల్ పాయింట్లు ఉన్నాయి. వాటి హోల్డర్ బేస్‌మెంట్లు పాడైపోయి గ్యాస్ లీకవుతోంది. ఈ విషయాన్ని అక్కడ ఏర్పాటుచేసిన ఇండికేటర్లు (రెడ్ లైట్ ద్వారా) సూచిస్తున్నాయి. ఈ విభాగం సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. అక్కడ వ్యర్థాలు తినడానికి వచ్చిన కాకి ఒకటి ఎల్‌డీ గ్యాస్ పీల్చి చనిపోయింది. ఆ కళేబరం ఇంకా అక్కడే ఉంది.

ఇవి సంస్కరణలా..?

ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడపాలంటే అన్నింటికీ నిర్వహణ పనులు చేపట్టాలి. అప్పుడే లక్ష్యం సాధించగలుగుతారు. అయితే యాజమాన్యం ఆ పనులను పక్కనపెట్టి ఉద్యోగుల పని గంటలు పెంచేసింది. తాజాగా స్టీల్‌ప్లాంటులో 30 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడిపేవారిని స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తించి నోటీసులు ఇస్తోంది. అదేవిధంగా టౌన్‌షిప్‌లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు యాజమాన్యమే నోటీసులు ఇస్తోంది. క్యాంటీన్లు ఇప్పటికే తొలగించింది. జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. ప్లాంటును లాభాలలోకి తీసుకురావడానికి చేపడుతున్న సంస్కరణలు ఇవేనా?...అని అంతా ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

మరో పరీక్షా కేంద్రానికి అనుమతి!

... 5వ పేజీ తరువాయి

నిర్వహించుకునేందుకు, పరీక్షా కేంద్రాల కోసం సుమారు 50కుపైగా దరఖాస్తులు ప్రస్తుతం అధికారులకు వచ్చినట్టు తెలిసింది. వీరంతా వివిధ మార్గాల ద్వారా సెంటర్లుగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే, ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటివరకూ ఆయా కాలేజీలకు అవకాశం కల్పించలేదు. ఈ తరుణంలో కొత్తగా ఆ ఒక్క కాలేజీకి ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై దూర విద్య కేంద్రం డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా... దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో టైలరింగ్ యూనిట్

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్‌లో ఆధునీకరించిన టైలరింగ్ యూనిట్‌ను సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం ప్రారంభించారు. ఏఆర్ బ్యారెక్స్‌లో ఉన్న టైలరింగ్ యూనిట్ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే భవనం కారిపోయేది. దీనివల్ల అందులో ఉంచిన యూనిఫాం నిల్వలు తడిచిపోవడంతో పాటు సిబ్బంది కుట్టుపని చేసేందుకు వీలుండేది కాదు.యూనిట్‌లోని సిబ్బంది విజ్ఞప్తి మేరకు సీపీ భవనానికి మరమ్మతులు చేయించి, ఆధునిక కుట్టుమిషన్లు, ఏసీలను ఏర్పాటుచేశారు. ఆధునీకరించిన యూనిట్‌ను కానిస్టేబుల్ పి.గోవింద చేతుల మీదుగా సీపీ రిబ్బన్ కట్టయించి ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ శాఖ సీఈవో



కొనుగోలుదారులతో మాట్లాడుతున్న సీఈవో మాధవీలత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత గురువారం సందర్శించారు. అన్ని కౌంటర్ల వద్ద ధరలను పరిశీలించారు. కర్నూలు ఉల్లిపాయల స్టాళ్ల వద్దకు వెళ్లి నాణ్యతను చూశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు వినియోగదారులతో కూడా మాట్లాడి బజార్‌లో సౌకర్యాల పట్ల ఆరా తీశారు. సీఈవో వెంట జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కిరణ్, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి రవికుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం, అతి వేగంగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ఇనుప, ఇతర వ్యర్థాలను తీసుకెళుతుండడమే కాకుండా అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ కాలనీ సమతా కళాశాల సమీపంలో ఏపీ 16 టీఎల్ 1064 నెంబరు గల వ్యాన్‌లో ఇనుము, వ్యర్థాలను తరలిస్తున్న సీతంపేట గొల్లవీధికి చెందిన గురువన దుర్గారావుపై ఏఎస్ఐ సత్యం కేసు నమోదు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

సిరిపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, అచ్యుత్ కోరారు. వైద్య కళాశాలలు పీపీపీ విధానం అమలుకు నిరసనగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ ఎంతమాత్రం మంచిదికాదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మధురెడ్డి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికుల నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :విశాఖ స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టు కార్మికులను ప్లాంటులోకి అనుమతించరాదని నిర్వాసిత నాయకులు, తొలగింపబడిన కార్మికులు గురువారం ప్లాంటు ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 42,అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 70, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

ముడసర్లోవ రిజర్వాయర్‌కు వరద నీరు చేరేదెలా?

- తూములో వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షం నీరు ప్రవహించని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడినప్పుడు ముడసర్లోవ రిజర్వాయర్‌కు చేరే వరదనీటి ప్రవాహం తూములో విపరీతంగా వ్యర్థాలు నిండిపోయాయి. దీంతో వరద నీరు రిజర్వాయర్‌కు చేరడం కష్టంగా మారుతోంది. ఫలితంగా రిజర్వాయర్‌లో వరద నీరు చేరే అవకాశం లేకుండా పోతోంది. వర్షాలు కురిసినప్పుడు ఎగువనున్న అడవి ప్రాంతం నుంచి వరద నీరు అధికంగా రిజర్వాయర్‌కు చేరేది. అయితే ఈ వరద నీరు వెళ్లే తూములో టన్నుల కొద్దీ వ్యర్థాలు చేరడంతో వర్షం నీరు రిజర్వాయర్‌కు చేరడం కష్టమవుతోంది. తూములో గుట్టలు కొద్దీ వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షం నీరు కలుషితమవుతోంది. అలాగే రిజర్వాయర్‌కు చేరే అవకాశం లేకపోవడంతో భారీ వర్షాలు పడినప్పుడు నీరు రిజర్వాయర్ వెనుక ఉన్న రామకృష్ణాపురం గ్రామం మునిగిపోయే పరిస్థితి నెలకొంది.



వరదనీరు రిజర్వాయర్‌కు చేరే తూములో పేరుకుపోయిన వ్యర్థాలు

ఎగువ ఉన్న తూము పరిస్థితిపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో కొందరు మూటలుగా వ్యర్థాలను తూములో పడేస్తున్నారు.

ఈతూములో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించే యత్నం చేయకపోవడంతో వర్షాలు పడినప్పుడు వరద నీరు రిజర్వాయర్‌కు వెళ్లకుండా బయట వైపునకు చేరి రామకృష్ణాపురం, పరిసర ప్రాంతాలు ముంపునకు కారణమవుతోందని స్థానికులు వాపోతున్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరిగే ఈ రిజర్వాయర్ వర్షాకాలంలో నిండితేనే వేసవిలో నగరానికి నీటి ఎద్దడి సమస్య ఎదురవకుండా ఉంటుంది. అలాంటి ముఖ్యమైన రిజర్వాయర్‌లో వరద నీరు చేరకుండా ఏర్పడిన అడ్డంకుల తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తూములో నిండిపోయిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీ-పుల్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 ఫైనలిస్టు నగరాలలో జీవీఎంసీ ఒకటిగా నిలిచిందని, పట్టణ సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలు కనుగొనడంలో అంతర్జాతీయ గుర్తింపుగా ఈ గౌరవం లభించిందని గ్రేటర్ విశాఖ సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీలోని తన చాంబర్‌లో గ్రేటర్ విశాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వీ-పుల్) మోడల్‌ను బలోపేతం చేయనున్నట్టు చెప్పారు. వీ-పుల్‌ను సంస్థాగతికరణ చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ వీ-పుల్ వేదిక ప్రజలు, సంస్థలు, సాంకేతిక నిపుణులు, ఇతర లబ్ధిదారులు అందరూ కలిసి కో-క్రియేషన్ పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు ఒక వేదికగా పని చేస్తుందన్నారు. ప్రతి పౌరుడు ముందుకు వచ్చి వీ-పుల్ ద్వారా తమ ఆలోచనలు, సూచనలను పంచుకోవాలని, ప్రతి ఆలోచన విలువైనదేనని, సమష్టి జ్ఞానం, చర్యల ద్వారా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి బలమైన, సురక్షితమైన, స్థితిస్థాపకమైన విశాఖపట్నం నిర్మించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. వీ-పుల్ ద్వారా అధికారులు ప్రజలు, వివిధ లబ్ధిదారులు కలిసి పని చేయుటకు, సమష్టి నిర్ణయాలు తీసుకొనడం ద్వారా గవర్నెన్స్‌ని అభివృద్ధిచేయుటకు ఉపయోగకరంగా ఉంటుందని కమిషనరు అన్నారు. ఈ వీ-పుల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా ముందుకు తీసుకొని వెళ్లడం సులభతరం కావచ్చన్నారు. వార్డు సభలను నిర్వహణ, వార్డు సచివాలయం వ్యవస్థను వీ-పుల్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి ప్రజలకు ఉపయోగకరంగా చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. వీ-పుల్ ద్వారా ప్రజలు వారి సమస్యలను అధికారులకు తెలియపరిచి తగు సూచనలను కూడా ఇవ్వడంతో పాటు వారి సూచనలను ప్రభుత్వం నిపుణులతో చర్చించి అవి అమలుకు అనుకూలమైతే వాటిని అమలు పరచవచ్చునన్నారు. సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పీవీవీ సత్యనారాయణరాజు, సీసీపీ ఎ.ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.నరేష్‌కుమార్, పీడీ-యూసీడీ పీఎం సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్లు, ఎస్ఆర్‌యూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ అరికట్టరూ..



న్యూశాంతినగర్‌లో రోడ్డు పక్కన పైపులైన్ నుంచి లీక్ అవుతున్న నీరు

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 11వ వార్డులో గల న్యూశాంతినగర్ లోతాగునీటి కొళాయిల నీరు లీక్ అయి రోడ్డు పైన ప్రవహిస్తూ వృథా పోతోంది.అలాగే నీరు ప్రవహిస్తుండడం వల్ల రోడ్డు చిత్తడిగా తయారవుతున్నాయి. దీనిపై జీవీఎంసీ తాగునీటి విభాగం స్పందించడం లేదంటూ స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూమిలోకి ఇచ్చిన కొళాయి కనెక్షన్ లీక్ కావడంతో ఈ విధంగా తాగునీరు వృథా అవుతోందని చెబుతున్నారు.ఈ మార్గం బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా నేపథ్యంలో తిరుపతి, సంబల్‌పూర్, ఇరోడ్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08583 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి నవంబరు 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి ఉదయం 11.15 గంటలకు విశాఖ చేరుతుంది.

సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్: 08311 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.20 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి నవంబరు 28 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, అదేరోజురాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

దువ్వాడ మీదుగా...

మధురై-బరౌని: 06059 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం రాత్రి 8.40 గంటలకు మధురైలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11 గంటలకు దువ్వాడ, మూడోరోజు ఉదయం 6.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 13 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శనివారం రాత్రి 11 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు వేకువజాము 2.25 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 7.45 గంటలకు మధురై చేరుతుంది.

చెన్నై సెంట్రల్-బరౌని:

06039 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు చెన్నైలో బయలుదేరిసోమవారం మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 8 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 17 నుంచి డిసెంబరు 3 వరకు ప్రతి బుధవారం రాత్రి 9 గంటలకు బరౌనిలో బయలుదేరి గురువారం రాత్రి 11.22 గంటలకు దువ్వాడ, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చెన్నై చేరుతుంది.

అంగా ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌లు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, భగల్‌పూర్ మధ్య నడిచే అంగా ఎక్స్‌ప్రెస్‌కు సుల్తాన్ గంజ్, ధరహార స్టేషన్లలో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

టీచర్ల బకాయిలపై గ్రేటర్ కమిషనర్‌తో చర్చించిన ఎమ్మెల్యే 'గాదె'

- సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదు టీచర్ల ఖాతాల్లో జమకు కమిషనర్ ఆదేశం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

సిరిపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో చర్చించారు. జీవీఎంసీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదును వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత విభాగం అధికారులతో మాట్లాడారు. సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదును ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని అదనపు కమిషనర్‌కు సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ మేరకు కమిషనర్‌కు ఎమ్మెల్సీ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించినందుకు ఈ సందర్భంగా కమిషనర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

పెదవాల్తేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులో రూ1.82 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తియ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈస్టు పాయింట్ కాలనీ, తమిళ వీధి, పద్మ ఆసుపత్రి, పీతలవీధి, నేతాజీ నగర్, సీబీఐ డౌన్, కొయ్యవారివీధి, విద్యానగర్ కాలనీ, కిర్లంపూడి లే అవుట్, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు, వంతెన నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, టీడీపీ21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, టీడీపీ నాయకులు పీతల అవినాష్, మూర్తి యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ



రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

మద్దిలపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగాపురంకాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆటోడ్రైవర్లతో కలిసి చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ దసరాకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు అందించి ఆటో కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. భవిష్యత్‌లో అన్ని వర్గాల ప్రజలు, ప్రాంతాలకు మరెన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, కార్యదర్శి మల్లా రవికుమార్, నాయకులు మదీనా, ఒమ్మి అప్పారావు, డేవిడ్, జనసేన నాయకులు పోతు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభం



మేడకు ఆనుకొని విద్యుత్ స్తంభం

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12 వ వార్డులో గల రాజీవ్ నగర్‌లో ఓ విద్యుత్ స్తంభం ఒక ఇంటి మేడపై ఆనుకొని ఉంది. ఎప్పుడైన పిల్లలు ఆడుకోవడానికి మేడపైకి వెళ్లే ఏమరుపాటుగా ఉంటే ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. మరి విద్యుత్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చూద్దాంలే అన్న నిర్లిప్త ధోరణిలో వారు ఉన్నట్టు అనిపిస్తోందని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు.

కాలువపై నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు


- స్వచ్ఛందంగా తొలగించిన ఓ దుకాణ యజమాని
- మిగతా వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



స్వగృహ ఫుడ్స్ ఎదురుగా కాలువపై నిర్మించిన సిమెంటు పలకను తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాలువపై గట్లను మూసి వేసి మరీ కార్ల పార్కింగ్ చేస్తున్నారని, దీనివల్ల వర్షం పడితే ఈ మార్గమంతా బురదమయంగా మారుతోందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జీవీఎంసీ జోన్-3 అధికారులు స్పందించారు. ఈ మార్గంలో కాలువలను పరిశీలించి కాలువలపై నిర్మించిన స్లాబులను తొలగించాలని గురువారం హెచ్చరించారు. దీంతో 16వ వార్డు ఇసుకతోట కృష్ణమందిరం మార్గంలోని స్వగృహ ఫుడ్స్ యాజమాన్యం వెంటనే స్పందించి కాలువపై గట్లను తొలగించి, కాలువను పునర్నిర్మించింది. కానీ ఆ పక్కనున్న బహుళ అంతస్థు నిర్మాణదారుడు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కాలువను మూసేసి తమ కార్యకలాపాలను యథావిధిగా చేస్తున్నారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని, ఇటువంటి నిర్లక్ష్య యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు



వస్త్ర సంచులను వినియోగించాలంటూ వాటిని ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రతపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అందజేసిన వస్త్ర సంచులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఒకసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- అండర్ గ్రౌండ్ విద్యుత్ వైర్లు ఉన్న చోట డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణాలకు గోతులు తవ్వుతుండగా విద్యుదాఘాతం
- పరుగులు తీసిన కూలీలు
- సచివాలయ సిబ్బందిపై విద్యుత్‌శాఖ సిబ్బంది ఆగ్రహం

మద్దిలపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పిఠాపురంకాలనీలో డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణాలకు చేపట్టిన తవ్వకాల వల్ల గురువారం ప్రమాదకర పరిస్థితి ఎదురైంది. గోతులు తవ్వుతున్న సమయంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ తీగలు తెగి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అగ్నిమంటలు చెలరేగాయి.



అండర్‌గ్రౌండ్ విద్యుత్‌తీగలు రిపేరు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

కూలీలకు షాక్ తగలగానే పనిముట్లు వదిలి పరుగులు పెట్టారు. స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారమివ్వగా, సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి అవాక్కయ్యారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లు వేసిన ప్రాంతంలో గోతులు ఏ విధంగా తవ్వుతారని సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేయడాన్ని తప్పుపట్టారు. పిఠాపురం కాలనీ బజార్ వద్ద గురువారం ఉదయం డ్రైనేజీ పనుల కోసం సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో గోతులు తీశారు. అయితే అక్కడే భూమి కింద నుంచి అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఆ విద్యుత్ లైన్లు గమనించకుండా కూలీలు గొయ్యి తీయడంతో వైర్లు తెగి వారికి షాక్ కొట్టింది. అంతేకాకుండా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చాయి. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బంది సచివాలయ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుదాఘాతం జరిగి ఎవరివైనా ప్రాణాలుపోతే ఎవరిది బాధ్యత అని మండిపడ్డారు. విద్యుత్ వైర్లు రిపేరు చేశారు. ఇకపై పనులు చేపడితే ఇలాంటి సంఘటనలు జరగకుండా తమకు సమాచారమివ్వాలని సూచించారు.

జీరో ఫెయిల్యూర్స్‌గా బస్సుల నిర్వహణ

- ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి ఆర్ఎం ఆదేశం



అధికారులు, గ్యారేజీ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జీరో ఫెయిల్యూర్స్‌గా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అధికారులు, సిబ్బందికి సూచించారు. విశాఖపట్నం డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిపో అధికారులు, గ్యారేజీ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రయాణికులను రవాణా చేసే బస్సులు మార్గమధ్యలో సాంకేతిక లోపాలు ఏర్పడి నిలిచిపోతే ప్రయాణికులు అసహనానికి గురి కావడమే కాకుండా ఇబ్బందులు పడతారని, అందువల్ల బస్సులు జీరో ఫెయిల్యూర్‌తో నడవాలని, దీనిపై గ్యారేజీ మెకానిక్‌లు, ఫోర్‌మెన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బస్సుల్లో ఏ చిన్న సాంకేతిక లోపం కనపడినా దాన్ని వెంటనే సవరించాలని సూచించారు. అలాగే బస్సుల నిర్వాహణకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

లయన్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ నియంత్రణ వాక్సినేషన్

సీతమ్మధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సీతమ్మధారలో గల లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సిన్లను ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది పిల్లల పేర్లను వారి తల్లిదండ్రులు నమోదు చేసుకున్నారన్నారు. వీరందరూ వాక్సినేషన్ శిబిరానికి వచ్చి వ్యాక్సినేషన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు హాజరు కానున్నారని తెలిపారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకుని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోసు వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఆడపిల్లలందరూ వినియోగించుకోవాలని కోరారు.

కాల్పులు ఘటనలో కోర్టులో లొంగిపోయిన మాజీ కానిస్టేబుల్

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పాత నగరంలో తుపాకీతో కాల్పులు జరిపిన సంఘటనలో అనుమానితుడిగా ఉన్న మాజీ కానిస్టేబుల్ నాయుడు కోర్టులో లొంగిపోయాడు. కొద్ది రోజుల క్రితం వన్‌టౌన్‌లోని చిలకపేట వద్ద పోర్టు బొగ్గు దొంగతనాలకు సంబంధించి విభేదాలు తలెత్తడంతో చేపల రాజేశ్ అనే వ్యక్తిపై కాల్పులు జరిపిన ఘటనలో మాజీ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్టు పోలీసులు భావించారు. తుపాకీని నిందితులకు నాయుడే అందించినట్టు పోలీసులు అనుమానించారు. అప్పటినుంచి నాయుడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం ఆయన కోర్టులో మేజిస్ట్రేట్ ముందు లొంగిపోయాడు, ఈ మేరకు ఆయనను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఐదుగురు అరెస్టు అయ్యారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ గురు వారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తులకు గోత్రనామాలతో పూజలు చేశారు.

విత్తన బంతుల తయారీలో 'సెయింట్ జోసెఫ్' ప్రపంచ రికార్డు

గంట వ్యవధిలో 11,19,000 సీడ్ బాల్స్ తయారీ

కార్యక్రమంలో పాల్గొన్న దేశవ్యాప్తంగా ఉన్న 16 బ్రాంచిల విద్యార్థులు



విత్తన బంతుల తయారీలో నిమగ్నమైన విద్యార్థినులు... పక్కన ప్రిన్సిపాల్ షైజీ, తదితరులు ప్రపంచ రికార్డును ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి డాక్టర్ షరీఫా హనీఫ్

జ్ఞానాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విత్తన బంతుల తయారీలో స్థానిక సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలు ప్రపంచ స్థాయి రికార్డు సాధించింది. సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ కాంగ్రిగేషన్ 375వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెయింట్ జోసెఫ్ ఆఫ్ అన్నెసీ, విశాఖపట్నం ప్రావిన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా విత్తన బంతుల తయారీ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు దేశవ్యాప్తంగా ఉన్న 16 సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని మొత్తం 11,19,000 సీడ్ బాల్స్‌ను తయారుచేశారు. విశాఖపట్నం సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల నుంచి 1,453 మంది పాల్గొని గంట వ్యవధిలో 1,63,251 విత్తన బంతులను తయారు చేసి రికార్డు సృష్టించారు. వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధులు ఈ ఘనతను ఆన్‌లైన్ ద్వారా, నగరంలో స్వయంగా పర్యవేక్షించి అధికారికంగా ప్రపంచ రికార్డును ధ్రువీకరిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, ప్రొవిన్షియల్ సిస్టర్ రోజ్‌లకు అవార్డు, సర్టిఫికెట్లను వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి డాక్టర్ షరీఫా హనీఫ్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె కళాశాల విద్యార్థినులు, అధ్యాపకుల సమష్టి కృషిని అభినందించారు. తాము తయారుచేసిన విత్తన బంతులను పర్యావరణ పరిరక్షణ కోసం ఖాళీ ప్రదేశాల్లో నాటుతామని ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, సిస్టర్ మేరీ, సిస్టర్ నాన్సిసిస్టర్ డేసీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, జయలక్ష్మి, డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలి

ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్

కలెక్టరేట్ వద్ద ఆందోళన



ర్యాలీగా వెళుతున్న ఆటో డ్రైవర్లు

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్ల వారికి ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ గురువారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు తమవాహనాలతో జీవీఎంసీ నుంచి జగదాంబ కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలను ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని, జీవో నంబర్-21, 31లను సవరించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని, భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మరణిస్తే రూ.పది లక్షల నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలకు సంబంధించి ర్యాపిడో, ఓలా సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

సచివాలయ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు



జడ్సీ మల్లయ్యనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలు, నిరసన కార్యక్రమాలను చేపడతామని రాష్ట్ర వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీజే గనేశ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ సూచనల మేరకు విశాఖ సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. అనంతరం జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. 15 రోజుల్లోగా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జేఏసీ నాయకులు పీవీ కిరణ్‌కుమార్, చింతకాయల బంగారురాజు, బీవీ అశోక్‌కుమార్, నాగేశ్వరరావు నాగరాజ, నళిని, సంతోశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

ఉపాధి అవకాశాలు వస్తాయని, ప్రైవేటు రంగంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంటు విషయంలో ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్మిక సంఘ నాయకుడు జె.అయోధ్యరాం, యు.రామస్వామి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నిర్వహణలోపం.. ఉక్కుకు శాపం

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో 15 నిమిషాలు ఉంటే కళ్లు తిరిగి పడిపోతారు. వాంతులు అవుతాయి. అంతకంటే ఎక్కువ సమయం ఉంటే ప్రాణాపాయం కలుగుతుంది. ఈ గ్యాస్‌కు 12 సీల్ పాయింట్లు ఉన్నాయి. వాటి హోల్డర్ బేస్‌మెంట్లు పాడైపోయి గ్యాస్ లీకవుతోంది. ఈ విషయాన్ని అక్కడ ఏర్పాటుచేసిన ఇండికేటర్లు (రెడ్ లైట్ ద్వారా) సూచిస్తున్నాయి. ఈ విభాగం సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. అక్కడ వ్యర్థాలు తినడానికి వచ్చిన కాకి ఒకటి ఎల్‌డీ గ్యాస్ పీల్చి చనిపోయింది. ఆ కళేబరం ఇంకా అక్కడే ఉంది.

ఇవి సంస్కరణలా..?

ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడపాలంటే అన్నింటికీ నిర్వహణ పనులు చేపట్టాలి. అప్పుడే లక్ష్యం సాధించగలుగుతారు. అయితే యాజమాన్యం ఆ పనులను పక్కనపెట్టి ఉద్యోగుల పని గంటలు పెంచేసింది. తాజాగా స్టీల్‌ప్లాంటులో 30 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడిపేవారిని స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తించి నోటీసులు ఇస్తోంది. అదేవిధంగా టౌన్‌షిప్‌లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు యాజమాన్యమే నోటీసులు ఇస్తోంది. క్యాంటీన్లు ఇప్పటికే తొలగించింది. జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. ప్లాంటును లాభాలలోకి తీసుకురావడానికి చేపడుతున్న సంస్కరణలు ఇవేనా?...అని అంతా ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

మరో పరీక్షా కేంద్రానికి అనుమతి!

... 5వ పేజీ తరువాయి

నిర్వహించుకునేందుకు, పరీక్షా కేంద్రాల కోసం సుమారు 50కుపైగా దరఖాస్తులు ప్రస్తుతం అధికారు లకు వచ్చినట్టు తెలిసింది. వీరంతా వివిధ మార్గాల ద్వారా సెంటర్లుగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే, ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటివరకూ ఆయా కాలేజీలకు అవకాశం కల్పించలేదు. ఈ తరుణంలో కొత్తగా ఆ ఒక్క కాలేజీకి ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై దూర విద్య కేంద్రం డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా... దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశ్రమల కోసం ల్యాండ్ బ్యాంకు

... 5వ పేజీ తరువాయి

ఎకరాలు కేటాయించారు. అయితే కొత్తవలస సమీపాన రెల్లి గ్రామంలో గిరిజన వర్సిటీకి గుర్తించిన భూముల్లో గ్రేహౌండ్స్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతో జగన్నాథపురంలో 350 ఎకరాలతోపాటు అక్కడే ఉన్న కొండ ప్రాంతాన్ని పరిశ్రమలకు కేటాయించేందుకు అవకాశం ఉంది. అలాగే గిడిజాల, రామవరం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, కణమాం, తదితర పంచాయతీల్లో ప్రభుత్వానికి చెందిన భూములతో పాటు కొండల వివరాలను సేకరిస్తున్నారు. ఆ ప్రక్రియ ముగిసిన తరువాత ఇక్కడకు వచ్చే సంస్థలకు భూములు కేటాయించనున్నారు. ఇదిలావుండగా రాష్ట్ర ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ బుధవారం నగరానికి వచ్చి ఐటీ సంస్థలకు భూముల కేటాయింపుపై జిల్లా అధికారులతో చర్చించారు. కంపెనీల నుంచి వచ్చే ప్రతిపాదనల మేరకు సాధ్యమైనంత వేగంగా భూములు కేటాయించాల్సి ఉంటుందన్న సూచన మేరకు అధికారులు ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేస్తున్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో టైలరింగ్‌యూనిట్ ప్రారంభం


టైలరింగ్ యూనిట్‌ను కానిస్టేబుల్‌తో ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ఆధునీకరించిన టైలరింగ్ యూనిట్‌ను సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం ప్రారంభించారు. ఏఆర్ బ్యారెక్స్‌లో ఉన్న టైలరింగ్ యూనిట్ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షంపడితే భవనం కారిపోయేది. దీనివల్ల అందులో ఉంచిన యూనిఫాం నిల్వలు తడిచిపోవడంతో పాటు సిబ్బంది కుట్టుపని చేసేందుకు వీలుండేది కాదు. దీంతో యూనిట్‌లోని సిబ్బంది విజ్ఞప్తి మేరకు సీపీ శంఖబ్రతబాగ్చి భవనానికి మరమ్మతులు చేయించి, ఆధునిక కుట్టుమిషన్లు, ఏసీలను ఏర్పాటుచేశారు. ఆధునికీకరించిన యూనిట్‌ను కానిస్టేబుల్ పి.గోవింద చేతుల మీదుగా సీపీ రిబ్బన్ కట్టయించి ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

తగరపువలస పీఏసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తగరపువలస ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ముగ్గురు సభ్యులతో కూడిన అనధికార కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ చైర్‌పర్సన్‌గా పీజీకే వర్మ, పర్సన్లుగా పొట్నూరు రాము, నమ్మి సత్యారావును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ కాలపరిమితి 2026 జనవరి 30వతేదీగా నిర్ణయించిన ప్రభుత్వం ఈలోగా ఎన్నికలు జరిగితే కమిటీ రద్దవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

తిక్కవానిపాలెం గ్రామానికి మహర్దశ

ఎట్టకేలకు రోడ్డు సదుపాయం దశాబ్దాల సమస్య నుంచి విముక్తి


పూర్తయిన తిక్కవానిపాలెం రోడ్డు

కంచరపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి తిక్కవానిపాలెంలో నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్థలం కావడంతో దశాబ్దాలుగా గ్రామం నుంచి కంచరపాలెం మెట్టు రోడ్డుకు రహదారి సదుపాయం ఏర్పాటు కాలేదు. దీంతో గతుకులు, రాళ్లుదేరిన మార్గం గుండా రాకపోకలు సాగిస్తూ స్థానికులు అవస్థలు పడేవారు. వర్షం పడితే నీరు నిలిచిపోయి ప్రమాదాలు జరిగేవి. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గతంలోనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అయితే అప్పట్లో ఎన్నికల నిబంధనలు అమలు కావడంతో పనులు జరగలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఈ రోడ్డుపై ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభించేలా అధికారులకు సూచించడంతో నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ20 లక్షలు మంజూరు చేసి పనులను ప్రారంభించడం పట్ల ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

టీడీపీ 44వ వార్డు అధ్యక్షుడిగా సత్యనారాయణ


సత్యనారాయణ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 44వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా గారపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీ శ్రీభరత్‌కు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ముగ్గురు యువతులకు ఆశ్రయం



యువతులతో జ్యోతిర్మయి తదితరులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ముగ్గురు యువతులకు ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మునియ(35), తిరుపతమ్మ(21), లక్ష్మి పార్వతి(18)లకు ఎవరూ లేకపోవడంతో వసతి గృహంలో చేర్పించామన్నారు. తిరుపతమ్మ పాపాహోంలో ఉండి చదువుకుందన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత ఆమెను స్వధార్ హోంలో చేర్పించారని, అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించామన్నారు. మిగిలిన ఇద్దరికి మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో వైద్యం అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

రైతుబజార్‌ను సందర్శించిన మాధవీ లత

» సమస్యలు పరిష్కరిస్తానని హామీ


రైతు బజార్‌లోకి వస్తున్న మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీ లత

సీతమ్మధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీ లత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. దీంతో ప్రస్తుతం వస్తున్న ఉల్లిపాయలు చాలా చిన్నవిగా ఉన్నాయని, మార్కెట్‌కు వచ్చేటప్పుడే తడిచిపోయి వస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. రైతు బజార్లలో వసతులను పరిశీలించి మిగిలిన విషయాలను ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తిని, మార్కెటింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతుబజార్ అటెండర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

28న జర్నలిస్టుల దసరా సంబరాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్టింగ్, పత్రిక అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'జర్నలిస్టుల దసరా సంబరాలు' నిర్వహిస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు.

యూజీడీ పనుల్లో అలసత్వం!


మాధవధార వద్ద ఆర్టీఏ కార్యాలయం దారిలో తవ్వేసిన రోడ్డు

మాధవధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇప్పటికీ ఇళ్ల నుంచి రోడ్డు మధ్య ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌కి కనెక్షన్లు ఇవ్వడం పూర్తి కాలేదు. మాధవధార ఆర్టీఏ కార్యాలయం రోడ్డులో యూజీడీ నిర్వహణ పనులు చూసే తాగునీటి సరఫరా విభాగం ఏఈ కార్యాలయం పక్కపక్క ఇళ్లకే కనెక్షన్లు మంజూరు చేయలేదు. కొత్తగా వేసిన తారు రోడ్లు తవ్వి ఇపుడు ఇళ్ల నుంచి మురుగునీటి పైపులను మ్యాన్‌హోల్స్‌కి కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ పనుల్లో సైతం కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ఇష్టానుసారంగా రోడ్డు మార్గాల్ని తవ్వి వదిలేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీఏ కార్యాలయ ప్రధాన రోడ్డులో పనుల కోసం తవ్విన మార్గంలోనే డిగ్రీ కళాశాల, సచివాలయాలు, పోలీస్ స్టేషన్, రవాణా శాఖ ఎల్ఎల్ఆర్ టెస్టింగ్ సెంటర్ ఉన్నాయి. వీటితో పాటు నివాసితులు, మాధవధార ఉడాకాలనీ చేరే వారు ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తారు. ప్రయాణికుల వాహనాలు, పాదచారుల భద్రత కోసం తవ్వకాల దగ్గర ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రాత్రి వేళల్లో అలాగే వదిలేయడం ప్రమాదాలకు దారితీస్తుందని స్థానికులు వాపోతున్నారు. యూజీడీ పనుల నిర్వహణ, మరమ్మతులు చేపట్టే ప్రదేశాల్లో కాంట్రాక్టు సంస్థ సిబ్బంది తగిన జాగ్రత్తలతో తవ్వకాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డీలర్లకు చేరిన 'ఈ పోస్' యంత్రాలు



మాధవధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్కిల్1 కంచరపాలెం పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో కార్యాయలయం పరిధిలో రేషన్ డిపో డీలర్లకు నూతన 'ఈ పోస్' మెషిన్లను గురువారం అందజేశారు. ఏఎస్‌వో శ్రీహరి, కార్యాలయ అధికారులు, సాంకేతిక సిబ్బంది డీలర్లకు వీటిని అందించారు. మర్రిపాలెం సివిల్ సప్లై గోడౌన్‌లో ఈ మెషిన్లను అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఒక్కరోజే 185 మంది డీలర్లలో అత్యధిక శాతం గురువారమే వీటిని తీసుకువెళ్లారు. మరికొంతమంది రేషన్ దుకాణాల్లో పంపిణీ ఉన్నందున మెషిన్లను తీసుకువెళ్లలేదు. ఇప్పటి వరకు డీలర్ల వినియోగించిన పాత ఈ పోస్ యంత్రాలను, చార్జింగ్ కేబుళ్లను విజన్‌టెక్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ కొత్త మెషిన్‌లో డ్యూయల్ సిమ్ సహాయంతో హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో పనిచేస్తాయి. క్వాడ్ కోర్ ప్రాసెసర్, కెమెరా, జీపీఎస్ వంటి ఫీచర్లు ఈ కొత్త మెషిన్‌లో ఉన్నాయి. థంబ్ ఇంప్రెషన్, స్మార్ట్ కార్డ్ స్వైప్ ఆప్షన్లను ఈ మెషిన్‌లో ఇన్‌స్టాల్ చేశారు. మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత ఈ మెషిన్లను పూర్తిస్థాయిలో డీలర్లు వినియోగించేందుకు వెసులుబాటు కలుగుతుందని అధికారులు తెలిపారు.

శిథిలమైన పాఠశాల భవనంపై ఎంపీకి నివేదిక

కంచరపాలెం,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్పీపేటలోని ఉన్నత పాఠశాల భవనం శిథిలమవడంతో ఎంపీ శ్రీభరత్ ఆదేశాల మేరకు తన కార్యాలయ సిబ్బంది గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థితి బాగాలేదని, నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉన్నదని సిబ్బంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేటట్టు చూస్తామని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ రాజశేఖర్ పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణం చేపట్టి దాదాపు ఐదు దశాబ్దాలు గడవడంతో శిథిలస్థితిలో ఉన్నదని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి తరగతి గదుల్లో నీరు కారిపోయేదని, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. పాఠశాల పరిస్థితిపై ఉపాధ్యాయులు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ జీవీఎంసీ కౌన్సిల్‌లో సమస్యను వివరించారని, దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు పాఠశాలను పరిశీలించి నివేదికను జీవీఎంసీ కమిషనర్‌కు అందజేశారని అన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యే గణబాబు ఎంపీ భరత్‌తో సమస్యను వివరించారని తెలిపారు. దీంతో ఎంపీ తన కార్యాలయ సిబ్బందికి ఆదేశించారని తెలిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కాండ్రేగుల వెంకటరావు, పాఠశాల హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి, ఏఈ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అంధుల టీ20 వరల్డ్ కప్ జట్టుకు కరుణకుమారి ఎంపిక



కరుణకుమారి

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత్ జట్టులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారికీ చోటు దక్కింది. నవంబరు 11 నుంచి 25 వరకు న్యూఢిల్లీ, బెంగళూరు వేదికలుగా జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టు 16 మంది సభ్యుల జాబితాను 'ద క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ)' గురువారం ప్రకటించింది. భారత్ జట్టుకు ఎంపికైన కరుణకుమారి ప్రస్తుతం విశాఖ రుషికొండ వద్ద ఉన్న ప్రభుత్వ అంధుల బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. బీ1 కేటగిరిలో భారత్ జట్టులో చోటు దక్కించుకున్న కరుణకుమారి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలలో రాణించింది. ప్రతిష్ఠాత్మక మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 క్రికెట్ టోర్నీకి ఆంధ్రప్రదేశ్ నుంచి కరుణకుమారి ఒక్కరే ఎంపికవడం విశేషం. దేశంలో తొలిసారిగా జరుగుతున్న మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 టోర్నీలో ఆతిథ్య భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, యూఎస్ఏ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

49వ వార్డులో దసరా ఉత్సవాలకు రాట పూజ

మురళీనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, జై దుర్గా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా నవరాత్రులకు గురువారం రాట పూజ జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వాసు రాట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఏకం చేసే ఈ ఉత్సవాలను మరింత శోభాయమానంగా చేపట్టాలని సూచించారు. పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో దసరా ఉత్సవాలను ఘనంగా చేపట్టడం ఆనవాయితీగా పాటిస్తున్నట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, బీజేపీ, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ శాఖ సీఈవో



కొనుగోలుదారులతో మాట్లాడుతున్న సీఈవో మాధవీలత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత గురువారం సందర్శించారు. అన్ని కౌంటర్ల వద్ద ధరలను పరిశీలించారు. కర్నూలు ఉల్లిపాయల స్టాళ్ల వద్దకు వెళ్లి నాణ్యతను చూశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు వినియోగదారులతో కూడా మాట్లాడి బజార్‌లో సౌకర్యాల పట్ల ఆరా తీశారు. సీఈవో వెంట జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కిరణ్, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి రవికుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం, అతి వేగంగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ఇనుప, ఇతర వ్యర్థాలను తీసుకెళుతుండడమే కాకుండా అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ కాలనీ సమతా కళాశాల సమీపంలో ఏపీ 16 టీఎల్ 1064 నెంబరు గల వ్యాన్‌లో ఇనుము, వ్యర్థాలను తరలిస్తున్న సీతంపేట గొల్లవీధికి చెందిన గురువన దుర్గారావుపై ఏఎస్‌ఐ సత్యం కేసు నమోదు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ హెచ్చరించారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

సిరిపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, అచ్యుత్ కోరారు. వైద్య కళాశాలలు పీపీపీ విధానం అమలుకు నిరశనగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ ఎంతమాత్రం మంచిదికాదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో మధురెడ్డి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికుల నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :విశాఖ స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టు కార్మికులను ప్లాంటులోకి అనుమతించరాదని నిర్వాసిత నాయకులు, తొలగింపబడిన కార్మికులు గురువారం ప్లాంటు ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 42,అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 70, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

ముడసర్లోవ రిజర్వాయర్‌కు వరద నీరు చేరేదెలా?

- తూములో వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షం నీరు ప్రవహించని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడినప్పుడు ముడసర్లోవ రిజర్వాయర్‌కు చేరే వరదనీటి ప్రవాహం తూములో విపరీతంగా వ్యర్థాలు నిండిపోయాయి. దీంతో వరద నీరు రిజర్వాయర్‌కు చేరడం కష్టంగా మారుతోంది. ఫలితంగా రిజర్వాయర్‌లో వరద నీరు చేరే అవకాశం లేకుండా పోతోంది. వర్షాలు కురిసినప్పుడు ఎగువనున్న అడవి ప్రాంతం నుంచి వరద నీరు అధికంగా రిజర్వాయర్‌కు చేరేది. అయితే ఈ వరద నీరు వెళ్లే తూములో టన్నుల కొద్దీ వ్యర్థాలు చేరడంతో వర్షం నీరు రిజర్వాయర్‌కు చేరడం కష్టమవుతోంది. తూములో గుట్టలు కొద్దీ వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షం నీరు కలుషితమవుతోంది. అలాగే రిజర్వాయర్‌కు చేరే అవకాశం లేకపోవడంతో భారీ వర్షాలు పడినప్పుడు నీరు రిజర్వాయర్ వెనుక ఉన్న రామకృష్ణాపురం గ్రామం మునిగిపోయే పరిస్థితి నెలకొంది.



వరదనీరు రిజర్వాయర్‌కు చేరే తూములో పేరుకుపోయిన వ్యర్థాలు

ఎగువ ఉన్న తూము పరిస్థితిపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో కొందరు మూటలుగా వ్యర్థాలను తూములో పడేస్తున్నారు.

ఈతూములో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించే యత్నం చేయకపోవడంతో వర్షాలు పడినప్పుడు వరద నీరు రిజర్వాయర్‌కు వెళ్లకుండా బయట వైపునకు చేరి రామకృష్ణాపురం, పరిసర ప్రాంతాలు ముంపునకు కారణమవుతోందని స్థానికులు వాపోతున్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరిగే ఈ రిజర్వాయర్ వర్షాకాలంలో నిండితేనే వేసవిలో నగరానికి నీటి ఎద్దడి సమస్య ఎదురవకుండా ఉంటుంది. అలాంటి ముఖ్యమైన రిజర్వాయర్‌లో వరద నీరు చేరకుండా ఏర్పడిన అడ్డంకుల తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తూములో నిండిపోయిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ అరికట్టరూ..



న్యూశాంతినగర్‌లో రోడ్డు పక్కన పైపులైన్ నుంచి లీక్ అవుతున్న నీరు

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 11వ వార్డులో గల న్యూశాంతినగర్ లోతాగునీటి కొళాయిల నీరు లీక్ అయి రోడ్డుపైన ప్రవహిస్తూ వృథా పోతోంది.అలాగే నీరు ప్రవహిస్తుండడం వల్ల రోడ్లు చిత్తడిగా తయారవుతున్నాయి. దీనిపై జీవీఎంసీ తాగునీటి విభాగం స్పందించడం లేదంటూ స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూమిలోకి ఇచ్చిన కొళాయి కనెక్షన్ లీక్ కావడంతో ఈ విధంగా తాగునీరు వృథా అవుతోందని చెబుతున్నారు.ఈ మార్గం బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా నేపథ్యంలో తిరుపతి, సంబల్‌పూర్, ఇరోడ్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08583 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి నవంబరు 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి ఉదయం 11.15 గంటలకు విశాఖ చేరుతుంది.

సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్: 08311 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.20 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి నవంబరు 28 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, అదేరోజురాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

దువ్వాడ మీదుగా...

మధురై-బరౌని: 06059 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం రాత్రి 8.40 గంటలకు మధురైలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11 గంటలకు దువ్వాడ, మూడోరోజు ఉదయం 6.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 13 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శనివారం రాత్రి 11 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు వేకువజాము 2.25 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 7.45 గంటలకు మధురై చేరుతుంది.

చెన్నై సెంట్రల్-బరౌని:

06039 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు చెన్నైలో బయలుదేరిసోమవారం మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 8 గంటలకు బరౌని చేరుతుంది. తి=రుగు ప్రయాణంలో ఈనెల 17 నుంచి డిసెంబరు 3 వరకు ప్రతి బుధవారం రాత్రి 9 గంటలకు బరౌనిలో బయలుదేరి గురువారం రాత్రి 11.22 గంటలకు దువ్వాడ, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చెన్నై చేరుతుంది.

అంగా ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌లు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, భగల్‌పూర్ మధ్య నడిచే అంగా ఎక్స్‌ప్రెస్‌కు సుల్తాన్ గంజ్, ధరహార స్టేషన్లలో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

వీ-పుల్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్-2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 ఫైనలిస్టు నగరాలలో జీవీఎంసీ ఒకటిగా నిలిచిందని, పట్టణ సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలు కనుగొనడంలో అంతర్జాతీయ గుర్తింపుగా ఈ గౌరవం లభించిందని గ్రేటర్ విశాఖ సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీలోని తన చాంబర్‌లో గ్రేటర్ విశాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేతన్ గార్గ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వీ-పుల్) మోడల్‌ను బలోపేతం చేయనున్నట్టు చెప్పారు. వీ-పుల్‌ను సంస్థాగతికరణ చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ వీ-పుల్ వేదిక ప్రజలు, సంస్థలు, సాంకేతిక నిపుణులు, ఇతర లబ్ధిదారులు అందరూ కలిసి కో-క్రియేషన్ పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు ఒక వేదికగా పని చేస్తుందన్నారు. ప్రతి పౌరుడు ముందుకు వచ్చి వీ-పుల్ ద్వారా తమ ఆలోచనలు, సూచనలను పంచుకోవాలని, ప్రతి ఆలోచన విలువైనదేనని, సమష్టి జ్ఞానం, చర్యల ద్వారా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి బలమైన, సురక్షితమైన, స్థితిస్థాపకమైన విశాఖపట్నం నిర్మించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. వీ-పుల్ ద్వారా అధికారులు ప్రజలు, వివిధ లబ్ధిదారులు కలిసి పని చేయుటకు, సమష్టి నిర్ణయాలు తీసుకొనడం ద్వారా గవర్నెన్సీని అభివృద్ధిచేయుటకు ఉపయోగకరంగా ఉంటుందని కమిషనరు అన్నారు. ఈ వీ-పుల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా ముందుకు తీసుకొని వెళ్లడం సులభతరం కావచ్చన్నారు. వార్డు సభలను నిర్వహణ, వార్డు సచివాలయం వ్యవస్థను వీ-పుల్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి ప్రజలకు ఉపయోగకరంగా చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. వీ-పుల్ ద్వారా ప్రజలు వారి సమస్యలను అధికారులకు తెలియపరిచి తగు సూచనలను కూడా ఇవ్వడంతో పాటు వారి సూచనలను ప్రభుత్వం నిపుణులతో చర్చించి అవి అమలుకు అనుకూలమైతే వాటిని అమలు పరచవచ్చునన్నారు. సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పీవీవీ సత్యనారాయణరాజు, సీసీపీ ఎ.ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.నరేష్‌కుమార్, పీడీ-యూసీడీ పీఎం సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్లు, ఎస్ఆర్‌యూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాలువపై నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు

- స్వచ్ఛందంగా తొలగించిన ఓ దుకాణ యజమాని
- మిగతా వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



స్వగృహ ఫుడ్స్ ఎదురుగా కాలువపై నిర్మించిన సిమెంటు పలకను తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాలువపై గట్లను మూసివేసి మరీ కార్ల పార్కింగ్ చేస్తున్నారని, దీనివల్ల వర్షం పడితే ఈ మార్గమంతా బురదమయంగా మారుతోందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జీవీఎంసీ జోన్-3 అధికారులు స్పందించారు. ఈ మార్గంలో కాలువలను పరిశీలించి కాలువలపై నిర్మించిన స్లాబులను తొలగించాలని గురువారం హెచ్చరించారు. దీంతో 16వ వార్డు ఇసుకతోట కృష్ణమందిరం మార్గంలోని స్వగృహ ఫుడ్స్ యాజమాన్యం వెంటనే స్పందించి కాలువపై గట్లను తొలగించి, కాలువను పునర్నిర్మించింది. కానీ ఆ పక్కనున్న బహుళ అంతస్థు నిర్మాణదారుడు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కాలువను మూసేసి తమ కార్యకలాపాలను యధావిధిగా చేస్తున్నారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని, ఇటువంటి నిర్లక్ష్య యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీచర్ల బకాయిలపై గ్రేటర్ కమిషనర్‌తో చర్చించిన ఎమ్మెల్యే 'గాదె'

- సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదు టీచర్ల ఖాతాల్లో జమకు కమిషనర్ ఆదేశం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

సిరిపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో చర్చించారు. జీవీఎంసీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదును వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత విభాగం అధికారులతో మాట్లాడారు. సస్పెన్షన్ అకౌంట్‌లో ఉన్న నగదును ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని అదనపు కమిషనర్‌కు సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ మేరకు కమిషనర్‌కు ఎమ్మెల్సీ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించినందుకు ఈ సందర్భంగా కమిషనర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

పెదవాల్తేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులో రూ1.82 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తియ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈస్టు పాయింట్ కాలనీ, తమిళ వీధి, పద్మ ఆసుపత్రి, పీతలవీధి, నేతాజీ నగర్, సీబీఐ డౌన్, కొయ్యవారివీధి, విద్యానగర్ కాలనీ, కిర్లంపూడి లే అవుట్, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు, వంతెన నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, టీడీపీ21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, టీడీపీ నాయకులు పీతల అవినాష్, మూర్తి యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ



రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

మద్దిలపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగాపురంకాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆటోడ్రైవర్లతో కలిసి చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ దసరాకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు అందించి ఆటో కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. భవిష్యత్‌లో అన్ని వర్గాల ప్రజలు, ప్రాంతాలకు మరెన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, కార్యదర్శి మల్లా రవికుమార్, నాయకులు మదీనా, ఒమ్మి అప్పారావు, డేవిడ్, జనసేన నాయకులు పోతు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభం



మేడకు ఆనుకొని విద్యుత్ స్తంభం

ఆరిలోవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12 వ వార్డులో గల రాజీవ్ నగర్ లో ఓ విద్యుత్ స్తంభం ఒక ఇంటి మేడపై ఆనుకొని ఉంది. ఎప్పుడైన పిల్లలు ఆడుకోవడానికి మేడపైకి వెళ్లే ఏమరుపాటుగా ఉంటే ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. మరి విద్యుత్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చూద్దాంలే అన్న నిర్లిప్త ధోరణిలో వారు ఉన్నట్టు అనిపిస్తోందని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు




వస్త్ర సంచులను వినియోగించాలంటూ వాటిని ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రతపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అందజేసిన వస్త్ర సంచులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఒకసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- అండర్ గ్రౌండ్ విద్యుత్ వైర్లు ఉన్న చోట డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణాలకు గోతులు తవ్వుతుండగా విద్యుదాఘాతం
- పరుగులు తీసిన కూలీలు
- సచివాలయ సిబ్బందిపై విద్యుత్‌శాఖ సిబ్బంది ఆగ్రహం



అండర్‌గ్రౌండ్ విద్యుత్‌తీగలు రిపేరు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

మద్దిలపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పిఠాపురంకాలనీలో డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణాలకు చేపట్టిన తవ్వకాల వల్ల గురువారం ప్రమాదకర పరిస్థితి ఎదురైంది. గోతులు తవ్వుతున్న సమయంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ తీగలు తెగి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అగ్నిమంటలు చెలరేగాయి. కూలీలకు షాక్ తగలగానే పనిముట్లు వదిలి పరుగులు పెట్టారు. స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారమివ్వగా, సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి అవాక్కయ్యారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లు వేసిన ప్రాంతంలో గోతులు ఏ విధంగా తవ్వుతారని సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేయడాన్ని తప్పుపట్టారు. పిఠాపురం కాలనీ బజార్ వద్ద గురువారం ఉదయం డ్రైనేజీ పనుల కోసం సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో గోతులు తీశారు. అయితే అక్కడే భూమి కింద నుంచి అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఆ విద్యుత్ లైన్లు గమనించకుండా కూలీలు గొయ్యి తీయడంతో వైర్లు తెగి వారికి షాక్ కొట్టింది. అంతేకాకుండా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చాయి. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బంది సచివాలయ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుదాఘాతం జరిగి ఎవరివైనా ప్రాణాలుపోతే ఎవరిది బాధ్యత అని మండిపడ్డారు. విద్యుత్ వైర్లు రిపేరు చేశారు. ఇకపై పనులు చేపడితే ఇలాంటి సంఘటనలు జరగకుండా తమకు సమాచారమివ్వాలని సూచించారు.

జీరో ఫెయిల్యూర్స్‌గా బస్సుల నిర్వహణ

- ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి ఆర్ఎం ఆదేశం



అధికారులు, గ్యారేజీ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జీరో ఫెయిల్యూర్స్‌గా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అధికారులు, సిబ్బందికి సూచించారు. విశాఖపట్నం డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిపో అధికారులు, గ్యారేజీ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రయాణికులను రవాణా చేసే బస్సులు మార్గమధ్యలో సాంకేతిక లోపాలు ఏర్పడి నిలిచిపోతే ప్రయాణికులు అసహనానికి గురి కావడమే కాకుండా ఇబ్బందులు పడతారని, అందువల్ల బస్సులు జీరో పెయిల్యూర్‌తో నడవాలని, దీనిపై గ్యారేజీ మెకానిక్‌లు, ఫోర్‌మెన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బస్సుల్లో ఏ చిన్న సాంకేతిక లోపం కనపడినా దాన్ని వెంటనే సవరించాలని సూచించారు. అలాగే బస్సుల నిర్వాహణకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

లయన్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ నియంత్రణ వాక్సినేషన్

సీతమ్మధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సీతమ్మధారలో గల లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సిన్లను ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది పిల్లల పేర్లను వారి తల్లిదండ్రులు నమోదు చేసుకున్నారన్నారు. వీరందరూ వాక్సినేషన్ శిబిరానికి వచ్చి వ్యాక్సినేషన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు హాజరు కానున్నారని తెలిపారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకుని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోసు వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఆడపిల్లలందరూ వినియోగించుకోవాలని కోరారు.

కాల్పుల ఘటనలో కోర్టులో లొంగిపోయిన మాజీ కానిస్టేబుల్

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పాత నగరంలో తూపాకీతో కాల్పులు జరిపిన సంఘటనలో అనుమానితుడిగా ఉన్న మాజీ కానిస్టేబుల్ నాయుడు కోర్టులో లొంగిపోయాడు. కొద్ది రోజుల క్రితం వన్‌టౌన్‌లోని చిలకపేట వద్ద పోర్టు బొగ్గు దొంగతనాలకు సంబంధించి విభేదాలు తలెత్తడంతో చేపల రాజేశ్ అనే వ్యక్తిపై కాల్పులు జరిపిన ఘటనలో మాజీ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్టు పోలీసులు భావించారు. తుపాకీని నిందితులకు నాయుడే అందించినట్టు పోలీసులు అనుమానించారు. అప్పటినుంచి నాయుడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం ఆయన కోర్టులో మేజిస్ట్రేట్ ముందు లొంగిపోయాడు, ఈ మేరకు ఆయనను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఐదుగురు అరెస్టు అయ్యారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవ గురు వారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తులకు గోత్రనామాలతో పూజలు చేశారు.

విత్తన బంతుల తయారీలో 'సెయింట్ జోసెఫ్' ప్రపంచ రికార్డు

గంట వ్యవధిలో 11,19,000 సీడ్ బాల్స్ తయారీ

కార్యక్రమంలో పాల్గొన్న దేశవ్యాప్తంగా ఉన్న 16 బ్రాంచిల విద్యార్థులు



విత్తన బంతుల తయారీలో నిమగ్నమైన విద్యార్థినులు... పక్కన ప్రిన్సిపాల్ షైజీ, తదితరులు ప్రపంచ రికార్డును ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి డాక్టర్ షరీఫా హనీఫ్

జ్ఞానాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విత్తన బంతుల తయారీలో స్థానిక సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలు ప్రపంచ స్థాయి రికార్డు సాధించింది. సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ కాంగ్రిగేషన్ 375వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెయింట్ జోసెఫ్ ఆఫ్ అన్నెసీ, విశాఖపట్నం ప్రావిన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా విత్తన బంతుల తయారీ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు దేశవ్యాప్తంగా ఉన్న 16 సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని మొత్తం 11,19,000 సీడ్ బాల్స్‌ను తయారుచేశారు. విశాఖపట్నం సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల నుంచి 1,453 మంది పాల్గొని గంట వ్యవధిలో 1,63,251 విత్తన బంతులను తయారు చేసి రికార్డు సృష్టించారు. వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధులు ఈ ఘనతను ఆన్‌లైన్ ద్వారా, నగరంలో స్వయంగా పర్యవేక్షించి అధికారికంగా ప్రపంచ రికార్డును ధ్రువీకరిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, ప్రొవిన్షియల్ సిస్టర్ రోజ్‌లకు అవార్డు, సర్టిఫికెట్లను వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి డాక్టర్ షరీఫా హనీఫ్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె కళాశాల విద్యార్థినులు, అధ్యాపకుల సమష్టి కృషిని అభినందించారు. తాము తయారుచేసిన విత్తన బంతులను పర్యావరణ పరిరక్షణ కోసం ఖాళీ ప్రదేశాల్లో నాటుతామని ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, సిస్టర్ మేరీ, సిస్టర్ నాన్సిసిస్టర్ డేసీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, జయలక్ష్మి, డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలి

ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్

కలెక్టరేట్ వద్ద ఆందోళన



ర్యాలీగా వెళుతున్న ఆటో డ్రైవర్లు

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్ల వారికి ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ గురువారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు తమవాహనాలతో జీవీఎంసీ నుంచి జగదాంబ కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలను ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని, జీవో నంబర్-21, 31లను సవరించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని, భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మరణిస్తే రూ.పది లక్షల నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలకు సంబంధించి ర్యాపిడో, ఓలా సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

సచివాలయ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు



జడ్సీ మల్లయ్యనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలు, నిరసన కార్యక్రమాలను చేపడతామని రాష్ట్ర వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీజే గనేశ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ సూచనల మేరకు విశాఖ సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. అనంతరం జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. 15 రోజుల్లోగా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జేఏసీ నాయకులు పీవీ కిరణ్‌కుమార్, చింతకాయల బంగారురాజు, బీవీ అశోక్‌కుమార్, నాగేశ్వరరావు నాగరాజ, నళిని, సంతోశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

ఉపాధి అవకాశాలు వస్తాయని, ప్రైవేటు రంగంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంటు విషయంలో ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్మిక సంఘ నాయకుడు జె.అయోధ్యరాం, యు.రామస్వామి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నిర్వహణలోపం.. ఉక్కుకు శాపం

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలో 15 నిమిషాలు ఉంటే కళ్లు తిరిగి పడిపోతారు. వాంతులు అవుతాయి. అంతకంటే ఎక్కువ సమయం ఉంటే ప్రాణాపాయం కలుగుతుంది. ఈ గ్యాస్‌కు 12 సీల్ పాయింట్లు ఉన్నాయి. వాటి హోల్డర్ బేస్‌మెంట్లు పాడైపోయి గ్యాస్ లీకవుతోంది. ఈ విషయాన్ని అక్కడ ఏర్పాటుచేసిన ఇండికేటర్లు (రెడ్ లైట్ ద్వారా) సూచిస్తున్నాయి. ఈ విభాగం సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. అక్కడ వ్యర్థాలు తినడానికి వచ్చిన కాకి ఒకటి ఎల్‌డీ గ్యాస్ పీల్చి చనిపోయింది. ఆ కళేబరం ఇంకా అక్కడే ఉంది.

ఇవి సంస్కరణలా..?

ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడపాలంటే అన్నింటికీ నిర్వహణ పనులు చేపట్టాలి. అప్పుడే లక్ష్యం సాధించగలుగుతారు. అయితే యాజమాన్యం ఆ పనులను పక్కనపెట్టి ఉద్యోగుల పని గంటలు పెంచేసింది. తాజాగా స్టీల్‌ప్లాంటులో 30 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడిపేవారిని స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తించి నోటీసులు ఇస్తోంది. అదేవిధంగా టౌన్‌షిప్‌లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు యాజమాన్యమే నోటీసులు ఇస్తోంది. క్యాంటీన్లు ఇప్పటికే తొలగించింది. జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. ప్లాంటును లాభాలలోకి తీసుకురావడానికి చేపడుతున్న సంస్కరణలు ఇవేనా?...అని అంతా ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

మరో పరీక్షా కేంద్రానికి అనుమతి!

... 5వ పేజీ తరువాయి

నిర్వహించుకునేందుకు, పరీక్షా కేంద్రాల కోసం సుమారు 50కుపైగా దరఖాస్తులు ప్రస్తుతం అధికారు లకు వచ్చినట్టు తెలిసింది. వీరంతా వివిధ మార్గాల ద్వారా సెంటర్లుగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే, ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటివరకూ ఆయా కాలేజీలకు అవకాశం కల్పించలేదు. ఈ తరుణంలో కొత్తగా ఆ ఒక్క కాలేజీకి ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై దూర విద్య కేంద్రం డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా... దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశ్రమల కోసం ల్యాండ్ బ్యాంకు

... 5వ పేజీ తరువాయి

ఎకరాలు కేటాయించారు. అయితే కొత్తవలస సమీపాన రెల్లి గ్రామంలో గిరిజన వర్సిటీకి గుర్తించిన భూముల్లో గ్రేహౌండ్స్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతో జగన్నాథపురంలో 350 ఎకరాలతోపాటు అక్కడే ఉన్న కొండ ప్రాంతాన్ని పరిశ్రమలకు కేటాయించేందుకు అవకాశం ఉంది. అలాగే గిడిజాల, రామవరం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, కణమాం, తదితర పంచాయతీల్లో ప్రభుత్వానికి చెందిన భూములతో పాటు కొండల వివరాలను సేకరిస్తున్నారు. ఆ ప్రక్రియ ముగిసిన తరువాత ఇక్కడకు వచ్చే సంస్థలకు భూములు కేటాయించనున్నారు. ఇదిలావుండగా రాష్ట్ర ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ బుధవారం నగరానికి వచ్చి ఐటీ సంస్థలకు భూముల కేటాయింపుపై జిల్లా అధికారులతో చర్చించారు. కంపెనీల నుంచి వచ్చే ప్రతిపాదనల మేరకు సాధ్యమైనంత వేగంగా భూములు కేటాయించాల్సి ఉంటుందన్న సూచన మేరకు అధికారులు ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేస్తున్నారు.

టీడీపీ 44వ వార్డు అధ్యక్షుడిగా సత్యనారాయణ


సత్యనారాయణ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 44వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా గారపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీ శ్రీభరత్‌కు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ముగ్గురు యువతులకు ఆశ్రయం



యువతులతో జ్యోతిర్మయి తదితరులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీఎస్సార్ కాంప్లెక్స్ లోని నిరాశ్రయుల వసతి గృహంలో ముగ్గురు యువతులకు ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మునియ(35), తిరుపతమ్మ(21), లక్ష్మి పార్వతి(18)లకు ఎవరూ లేకపోవడంతో వసతి గృహంలో చేర్పించామన్నారు. తిరుపతమ్మ పాపాహోంలో ఉండి చదువుకుందన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత ఆమెను స్వధార్ హోంలో చేర్పించారని, అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించామన్నారు. మిగిలిన ఇద్దరికి మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో వైద్యం అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

రైతుబజార్‌ను సందర్శించిన మాధవీ లత

» సమస్యలు పరిష్కరిస్తానని హామీ


రైతు బజార్‌లోకి వస్తున్న మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీ లత

సీతమ్మధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీ లత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. దీంతో ప్రస్తుతం వస్తున్న ఉల్లిపాయలు చాలా చిన్నవిగా ఉన్నాయని, మార్కెట్‌కు వచ్చేటప్పుడే తడిచిపోయి వస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. రైతు బజార్లలో వసతులను పరిశీలించి మిగిలిన విషయాలను ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తిని, మార్కెటింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతుబజార్ అటెండర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

28న జర్నలిస్టుల దసరా సంబరాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్టింగ్, పత్రిక అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'జర్నలిస్టుల దసరా సంబరాలు' నిర్వహిస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు.

యూజీడీ పనుల్లో అలసత్వం!


మాధవధార వద్ద ఆర్టీఏ కార్యాలయం దారిలో తవ్వేసిన రోడ్డు

మాధవధార, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇప్పటికీ ఇళ్ల నుంచి రోడ్డు మధ్య ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌కి కనెక్షన్లు ఇవ్వడం పూర్తి కాలేదు. మాధవధార ఆర్టీఏ కార్యాలయం రోడ్డులో యూజీడీ నిర్వహణ పనులు చూసే తాగునీటి సరఫరా విభాగం ఏఈ కార్యాలయం పక్కపక్క ఇళ్లకే కనెక్షన్లు మంజూరు చేయలేదు. కొత్తగా వేసిన తారు రోడ్లు తవ్వి ఇపుడు ఇళ్ల నుంచి మురుగునీటి పైపులను మ్యాన్‌హోల్స్‌కి కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ పనుల్లో సైతం కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ఇష్టానుసారంగా రోడ్డు మార్గాల్ని తవ్వి వదిలేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీఏ కార్యాలయ ప్రధాన రోడ్డులో పనుల కోసం తవ్విన మార్గంలోనే డిగ్రీ కళాశాల, సచివాలయాలు, పోలీస్ స్టేషన్, రవాణా శాఖ ఎల్‌ఎల్‌ఆర్ టెస్టింగ్ సెంటర్ ఉన్నాయి. వీటితో పాటు నివాసితులు, మాధవధార ఉడాకాలనీ చేరే వారు ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తారు. ప్రయాణికుల వాహనాలు, పాదచారుల భద్రత కోసం తవ్వకాల దగ్గర ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రాత్రి వేళల్లో అలాగే వదిలేయడం ప్రమాదాలకు దారితీస్తుందని స్థానికులు వాపోతున్నారు. యూజీడీ పనుల నిర్వహణ, మరమ్మతులు చేపట్టే ప్రదేశాల్లో కాంట్రాక్టు సంస్థ సిబ్బంది తగిన జాగ్రత్తలతో తవ్వకాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా నేపథ్యంలో తిరుపతి, సంబల్‌పూర్, ఇరోడ్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి-విశాఖ: 08583 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి నవంబరు 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి ఉదయం 11.15 గంటలకు విశాఖ చేరుతుంది.

సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్: 08311 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.20 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి నవంబరు 28 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, అదేరోజురాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

దువ్వాడ మీదుగా...

మధురై-బరౌని: 06059 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి నవంబరు 26 వరకు ప్రతి బుధవారం రాత్రి 8.40 గంటలకు మధురైలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11 గంటలకు దువ్వాడ, మూడోరోజు ఉదయం 6.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 13 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శనివారం రాత్రి 11 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు వేకువజాము 2.25 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 7.45 గంటలకు మధురై చేరుతుంది.

చెన్నై సెంట్రల్-బరౌని:

06039 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు చెన్నైలో బయలుదేరిసోమవారం మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 8 గంటలకు బరౌని చేరుతుంది. తిఃరుగు ప్రయాణంలో ఈనెల 17 నుంచి డిసెంబరు 3 వరకు ప్రతి బుధవారం రాత్రి 9 గంటలకు బరౌనిలో బయలుదేరి గురువారం రాత్రి 11.22 గంటలకు దువ్వాడ, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చెన్నై చేరుతుంది.

అంగా ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్టులు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, భగల్‌పూర్ మధ్య నడిచే అంగా ఎక్స్‌ప్రెస్‌కు సుల్తాన్ గంజ్, ధరహార స్టేషన్లలో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

మహిళల అంధుల టీ20 వరల్డ్ కప్ జట్టుకు కరుణకుమారి ఎంపిక



కరుణకుమారి

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత్ జట్టులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారికీ చోటు దక్కింది. నవంబరు 11 నుంచి 25 వరకు న్యూఢిల్లీ, బెంగళూరు వేదికలుగా జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టు 16 మంది సభ్యుల జాబితాను 'ద క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ)' గురువారం ప్రకటించింది. భారత్ జట్టుకు ఎంపికైన కరుణకుమారి ప్రస్తుతం విశాఖ రుషికొండ వద్ద ఉన్న ప్రభుత్వ అంధుల బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. బీ1 కేటగిరిలో భారత్ జట్టులో చోటు దక్కించుకున్న కరుణకుమారి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలలో రాణించింది. ప్రతిష్ఠాత్మక మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 క్రికెట్ టోర్నీకి ఆంధ్రప్రదేశ్ నుంచి కరుణకుమారి ఒక్కరే ఎంపికవడం విశేషం. దేశంలో తొలిసారిగా జరుగుతున్న మహిళల అంధుల వరల్డ్ కప్ టీ20 టోర్నీలో ఆతిథ్య భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, యూఎస్ఏ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

49వ వార్డులో దసరా ఉత్సవాలకు రాట పూజ

మురళీనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వవార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, జై దుర్గా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా నవరాత్రులకు గురువారం రాట పూజ జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వాసు రాట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఏకం చేసే ఈ ఉత్సవాలను మరింత శోభాయమానంగా చేపట్టాలని సూచించారు. పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో దసరా ఉత్సవాలను ఘనంగా చేపట్టడం ఆనవాయితీగా పాటిస్తున్నట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, బీజేపీ, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో టైలరింగ్‌యూనిట్ ప్రారంభం


టైలరింగ్ యూనిట్‌ను కానిస్టేబుల్‌తో ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ఆధునీకరించిన టైలరింగ్ యూనిట్‌ను సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం ప్రారంభించారు. ఏఆర్ బ్యారెక్స్‌లో ఉన్న టైలరింగ్ యూనిట్ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షంపడితే భవనం కారిపోయేది. దీనివల్ల అందులో ఉంచిన యూనిఫాం నిల్వలు తడిచిపోవడంతో పాటు సిబ్బంది కుట్టుపని చేసేందుకు వీలుండేది కాదు. దీంతో యూనిట్‌లోని సిబ్బంది విజ్ఞప్తి మేరకు సీపీ శంఖబ్రతబాగ్చి భవనానికి మరమ్మతులు చేయించి, ఆధునిక కుట్టుమిషన్లు, ఏసీలను ఏర్పాటుచేశారు. ఆధునికీకరించిన యూనిట్‌ను కానిస్టేబుల్ పి.గోవింద చేతుల మీదుగా సీపీ రిబ్బన్ కట్టయించి ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

తగరపువలస పీఏసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తగరపువలస ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ముగ్గురు సభ్యులతో కూడిన అనధికార కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ చైర్‌పర్సన్‌గా పీజీకే వర్మ, పర్సన్లుగా పొట్నూరు రాము, నమ్మి సత్యారావును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ కాలపరిమితి 2026 జనవరి 30వతేదీగా నిర్ణయించిన ప్రభుత్వం ఈలోగా ఎన్నికలు జరిగితే కమిటీ రద్దవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

తిక్కవానిపాలెం గ్రామానికి మహర్దశ

ఎట్టకేలకు రోడ్డు సదుపాయం దశాబ్దాల సమస్య నుంచి విముక్తి


పూర్తయిన తిక్కవానిపాలెం రోడ్డు

కంచరపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి తిక్కవానిపాలెంలో నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్థలం కావడంతో దశాబ్దాలుగా గ్రామం నుంచి కంచరపాలెం మెట్టు రోడ్డుకు రహదారి సదుపాయం ఏర్పాటు కాలేదు. దీంతో గతుకులు, రాళ్లుతేరిన మార్గం గుండా రాకపోకలు సాగిస్తూ స్థానికులు అవస్థలు పడేవారు. వర్షం పడితే నీరు నిలిచిపోయి ప్రమాదాలు జరిగేవి. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఉత్తర నియోజక వర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గతంలోనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అయితే అప్పట్లో ఎన్నికల నిబంధనలు అమలు కావడంతో పనులు జరగలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఈ రోడ్డుపై ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభించేలా అధికారులకు సూచించడంతో నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేసి పనులను ప్రారంభించడం పట్ల ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

కణితి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ కష్టాలు

- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు
- భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని వేడుకోలు



ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిన వాహనదారులు

గాజువాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కణితి రోడ్డులో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాజువాకకు కీలకమైన కణితి రోడ్డులో సింధియా వైపు గల కర్మాగారాలకు, ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఈ మార్గాన్నే వినియోగిస్తారు. దీంతో నిత్యం ఈ మార్గం వాహనాలతో కిటకిటలాడుతుంటుంది. ఈ రోడ్డును 60 అడుగుల నుంచి 80 అడుగుల మేరకు విస్తరించినప్పటికీ ట్రాఫిక్ సమస్యలు ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ప్రధానంగా ఈ రోడ్డులో నిత్యావసర వస్తువులకు సంబంధించి హోల్‌సేల్ షాపులు, బంగారం దుకాణాలు, ప్రధాన కూరగాయాల మార్కెట్‌తో పాటు అన్ని రకాల వస్తు సామగ్రి లభించే వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఆయా వస్తువులను కొనుగోలు చేసేందుకు పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. అలాగే వివిధ కర్మాగారాల ఉద్యోగులు, ఇతరులకు కణితి రోడ్డు కీలకంగా మారింది. అధిక సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కాగా ఈ మార్గంలో భారీ వాహనాలు ప్రవేశించకుండా స్టాపర్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని నియంత్రించే సిబ్బంది లేకపోవడంతో ఆ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటివల్ల కూడా ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు ఈ మార్గంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులతో పాటు స్థానిక వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎదురువానిపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా!

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి



మల్కాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు పరిధి ఎదురువానిపాలెం సర్వే నంబర్-17లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ములగాడ మండల తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బిజీగా ఉండగా సదరు కబ్జాదారుడు ఇక్కడి శ్మశానానికి సమీపంలో సుమారు 300 గజాల సర్కారు స్థలాన్ని చదును చేసి అమ్మకానికి సిద్ధం చేశాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఈ ప్రాంతంలో గల అనేక భూముల్లో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కబ్జాదారుడు యథేచ్ఛగా రూ.లక్షల విలువ చేస్తే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశాడని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు

తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని కుంచమాంబ కాలనీవాసుల ఆవేదన



కుంచుమాంబ కాలనీలో ఓ విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి కుంచుమాంబ కాలనీలో విద్యుత్ స్తంభాల నుంచి ఇళ్ల వరకు ఉన్న సర్వీసు వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క, ఇళ్లకు ఆనుకుని విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్ల మూలంగా తరచూ హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో ఇళ్లలోని టీవీల, ఫ్రిడ్జ్‌లతో పాటు విద్యుత్ సామగ్రి పాడైపోతున్నాయని వాపోతున్నారు. దీనికితోడు వివిధ నెట్‌వర్కులకు సంబంధించిన వైర్లను విద్యుత్ స్తంభాలకు కట్టి మిగిలిన వైరును కట్టలుగా వదిలేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అందువల్ల విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి రాజులపాలెంలో గురువారం రూ.26 లక్షలతో తాగునీటి పైపు లైన్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమికి వాహనమిత్ర పథకం ద్వారా ఆటోడ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, లక్కరాజు సోంబాబు, ఎస్.పెంటారావు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, ఎం.రాము, రాంబాబు, దానయ్య, కె.శ్రీనివాసనాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వాన నీరు నిలవకుండా చర్యలు



సరిపల్లి హైవే బ్రిడ్జి నీరు పారేందుకు వీలుగా కాలువ తీసిన దృశ్యం

పెందుర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిసినప్పుడల్లా నేషనల్ ఎక్స్‌ప్రెస్ సిక్స్ లేన్ల రహదారి చెరువును తలపిస్తున్నట్టు ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో 'వానొస్తే హైవే చెరువే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం వారు సిక్స్ లైన్ల రహదారి, సరిపల్లి రోడ్డు వోవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) వద్ద తిష్ఠ వేసిన నీటిని యంత్రాల సహకారంతో తొలగించారు. పాత పెందుర్తి హైవే రోడ్డుకు సమీపంలో గల పెద్ద చెరువు పల్లపు ప్రాంతం నుంచి కిందకు ప్రవహిస్తూ సిక్స్ లైన్ల రహదారి, సరిపల్లి సర్వీస్ రోడ్డుపైకి వస్తుండడంతో ఏర్పాటు చేసిన కాలువ ద్వారా నీటిని ఆర్వోబీ కిందన గల ఖాళీ స్థలాల్లోకి పంపేందుకు చర్యలు చేపట్టారు. కాగా పెద్ద చెరువు నీటి ఉధృతి తగ్గకపోవడంతో ఇంకా రహదారిపై జలపాతంలో ప్రవహిస్తునే ఉంది. నామమాత్రంగా కాకుండా హైవేపై ఎప్పుడూ వర్షపు నీరు నిలవకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం కాలనీకి ఆనుకుని ఉన్న పంచవటి వుడా కాలనీని మురుగు నీటి సమస్య నుంచి కాపాడాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం నగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కిరెడ్డిపాలెం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వాడుక నీటితో పాటు వర్షపు నీరు, షీలానగర్ ఎగువ ప్రాంతాలకు చెందిన వాన నీరు పంచవటి కాలనీకి ఆనుకుని ఉన్న ప్రధాన కాలువ నుంచే పోర్టు రోడ్డు వద్దనున్న పెద్ద గెడ్డలోకి చేరుతుందన్నారు. ప్రస్తుతం పోర్టు రహదారి విస్తరణ వల్ల ప్రధాన కాలువలోనుంచి నీరు పెద్ద గెడ్డలోకి వెళ్లే మార్గం మూతపడుతుందని వారు వివరించారు. గెడ్డలోకి నీరు వెళ్లకపోతే పంచవటి కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని,అందువల్ల తగిన చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు పి.చిన్నారావు, రామ్మోహన్, ఎస్.పాండా ఉన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పెదగంట్యాడకు చెందిన యడ్లపాటి శశికిరణ్ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి ప్రసన్నలక్ష్మీకి గురువారం ఆయన అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబానికి అంతరాలయ దర్శనం కల్పించి, గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తిరుమల నగర్‌ల కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు



ర్యాలీలో పాల్గొన్న తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాలు దరి చేరవని తిరుమల నగర్‌ల కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. 87వ వార్డు పరిధి కణితి, తిరుమలనగర్‌ల్లో గురువారం వారు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా చెట్లు కొమ్మలను, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్ బాక్స్‌లు, క్లాత్ సంచులను వాడాలని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, దేముడు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో అల్గోజెనిత్ క్లబ్ ప్రారంభం

అగనంపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్గోజెనిత్ క్లబ్‌ను ప్రారంభించారు. క్లబ్‌ను ప్రారంభించిన ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ ఎన్.గాయత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో కోడింగ్ కల్చర్, కాంపిటేటివ్ ప్రోగ్రామింగ్ సమస్యల పరిష్కారం, నైపుణ్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా అల్గోజెనిత్ క్లబ్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు రీతిక, భాషిణి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 97వ వార్డు పరిలో రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్ శంకుస్థాపన చేశారు. సుజాతనగర్ సమీప గోపాలకృష్ణనగర్‌లో రూ.30 లక్షలతో తారురోడ్డు, రూ.20 లక్షలతో వెంకటాద్రినగర్‌లో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎ.అప్పలనాయుడు, అర్జున్ చౌదరి, కొండబాబు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ఘనంగా కళా ఉత్సవ్



నృత్యంలో మొదటి బహుమతి పొందిన నడుపూరు విద్యార్థులు

భీమునిపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి డైట్ కళాశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్ గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధే ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం ఏటా కళాఉత్సవ్ నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల్లో కళాత్మక ప్రతిభను వెలికితీసే అద్భుతమైన వేదిక కళా ఉత్సవ్ అని అన్నారు. అనంతరం రెండు రోజుల పాటు జరిగే ఉత్సవ్‌లో భాగంగా మొదటి రోజు పాటల పోటీ, నృత్య ప్రదర్శన, మ్యూజిక్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 45 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 80 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. వాయిద్యం సోలో విభాగంలో కాశీపురం విద్యార్థి టి. రఫీ, ఆరిపాక విద్యార్థి ఎస్. ప్రణీత్‌కుమార్ మొదటి రెండు స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో నడుపూరు హైస్కూల్ ప్రథమ, భీమిలి పీఎస్ఎంత జీవీఎంసీ స్కూల్ ద్వితీయ, హెచ్‌సీ వెంకటాపురం తృతీయ స్థానాల్లో నిలిచాయి. పాటల పోటీలో సోలో విభాగంలో విశాఖ విశ్వదయ హైస్కూల్ విద్యార్థిని ఐ. కృష్ణలేఖ, విశాఖ గాయత్రి కళాశాల విద్యార్థిని ఎం. సత్య నిఖిత, ఎస్. స్నేహిత మొదటి మూడు స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో థెరిస్సా స్కూల్ పీఎంపాలెం, నడుపూరు జడ్పీహెచ్ఎస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం నక్కపల్లి పాఠశాలలు గెలుపొందాయి. నృత్యం సోలో విభాగంలో ఎం. లాస్య (శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్), సీహెచ్ హశ్విత (శ్రీచైతన్య ద్వారకానగర్), పి. ప్రియాంక సామల్ (జడ్పీహెచ్ఎస్ నడుపూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. గ్రూపు విభాగంలో నడుపూరు జడ్పీహెచ్ఎస్, కాపులుప్పాడ శ్రీ ప్రకాష్, కాశీపురం జడ్పీహెచ్ఎస్ విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందినవారు నవంబర్‌లో రాష్ట్రస్థాయిలో జరిగే కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నీలవేణి

'సంకల్పం'పై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ (పెందుర్తి) ఆధ్వర్యంలో గురువారం పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్ప పథకంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సీడీపీవో నీలవేణి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలను బాల్య వివాహాలకు దూరంగా ఉంచాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెల్లాయమ్మ, అంగన్‌వాడీలు సరస్వతి, తులసి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ముందస్తుగా చేసుకుంటే అటువంటి లక్షణాలు ఉన్నవారు ప్రాణాపాయం నుంచి బయపడేందుకు అవకాశం ఉంటుందని నమ్మిదొడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భవ్య అన్నారు. ఇస్లాంపేట హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యపరంగా ఏ ఇబ్బందులు ఉన్నా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మల్కాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యారణ పరిరక్షణకు, ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములు కావాలని జనసేన పార్టీ 58వ వార్డు అధ్యక్షుడు ముప్పిన ధర్మేంద్ర కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను 'వనసేన-ప్రకృతిని కాపాడే సేన' పేరుతో ముద్రించిన టీషర్టులను గురువారం నగరంలో దక్షిణ ఎమ్మెల్యే, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ వారంలో ఒకరోజు కొండలపై ట్రెక్కింగ్ చేసి అక్కడి వ్యర్థాలను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

సాయినాథునికి పూజలు

అగనంపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథున్ని అర్చకులు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284



ఉక్కు కర్మాగారంలో ప్రైవేటు క్యాంటీన్లను కూల్చివేసిన దృశ్యం

స్టీల్ ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లు నేలమట్టం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లను నేలమట్టం చేశారు. ప్లాంటులో సుమారు వంద వరకు ప్రైవేటు క్యాంటీన్లు ఉండేవి. ఉక్కు అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ఆయా క్యాంటీన్లను నిర్వాహకులు ఖాళీ చేసేశారు. అయితే యాజమాన్యం కనికరించి మళ్లీ తమకు అవకాశం కల్పిస్తుందన్న ఆశతో వారంతా ఉన్నారు. ఈ తరుణంలో రెండు రోజుల నుంచి కర్మాగారంలోని ప్రైవేటు క్యాంటీన్లను అధికారులు మిషన్ సహాయంతో నేలమట్టం చేయించారు. దీంతో నిర్వాహకుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. ఇదిలావుండగా ప్లాంట్ గేటు బయట కొంతమంది చిరు వ్యాపారులు చిన్నపాటి సామగ్రి, తిరుబండారాలు అమ్మేవారు. అయితే అక్కడ ఎలాంటి వ్యాపారాలు చేయరాదంటూ అధికారులు స్పష్టం చేయడంతో గురువారం నుంచి అమ్మకాలను నిలిపివేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాట వేసిన కార్పొరేటర్లు లక్ష్మీబాయి, వంశీరెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం దల్లివానిపాలెం జంక్షన్‌లో పందిరిరాట వేశారు. 74,75 వార్డుల కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి లక్ష్మీబాయి, బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పూజాది కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జాగారపు శ్రీను, గంట్యాడ గురుమూర్తి, జ్యోతిరెడ్డి, దల్లి పైడికొండ, కరణం బాబూరావు, డి.అప్పారావు, పి.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం దిగొచ్చే వరకు పోరాటం

ఉక్కు నిర్వాసిత నాయకులు



ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టు కార్మికులను ప్లాంటులోకి అనుమతించరాదని డిమాండ్ చేస్తూ నిర్వాసిత నాయకులు, పనుల నుంచి తొలగించిన కార్మికులు గురువారం ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహించిన వారిని పక్కన పెట్టి, ఇప్పుడు ఇతర రాష్ట్రాల కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించడం సమంజసం కాదన్నారు. త్వరలోనే తాము కార్యాచరణను ప్రకటించి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పితాన భాస్కరరావు, ప్రసాద్, మంత్రి రవి, రమణ, గణేశ్, రాజు, రమణ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

పెందుర్తి క్రైమ్ ఎస్ఐ సూరిబాబు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాల భద్రతకు సీసీ కెమెరాలు తప్పనిసరి అని పెందుర్తి క్రైమ్ ఎస్ఐ సూరిబాబు అన్నారు. పెందుర్తి క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక సాయి ఐటీఐలో విద్యార్థులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆధారాలతో కేసుల్లో పురోగతిని సాధించవచ్చన్నారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణకు పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాల ఆవరణలో వర్షాలతో గోడ కూలిపోవడంతో ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. ఈ విషయాన్ని స్కూల్ యాజమాన్యం కార్పొరేటర్ బొమ్మిడి రమణ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చేపట్టిన సిమెంట్ బేస్‌మెంట్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

సింధియా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీలో షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణం దగ్ధమైన బాధిత కుటుంబానికి వైసీపీ మహిళలు గురువురం కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ మహిళలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు బీశెట్టి గణేశ్, మహిళలు భారతి, మసేనమ్మ, కమల, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెం కాలనీలో గురువారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. కాలనీలో సుమారు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీలోని రోడ్డు, కాలువలును తిలకించారు. గ్రంథాలయ పనుల్లో నాణ్యతను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టరుకు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు సంగ్రాన చిన సన్యాసిరావు, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన

వేపగుంట సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ముత్యాలమ్మ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద అన్న సమారాధనను గురువారం కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. 21 రకాల వంటకాలతో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజజేసిన యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముత్తానాయుడు, గంట్ల దేముడు, ఎస్.అప్పారావు, స్థానిక నాయకులు మామిడి కిరణ్, నవీన్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిరుతిళ్లతో ప్రమాదమే!

ఊబకాయానికి అవే కారకాలు



పిల్లల్లో ఇటీవల పెరుగుతున్న సమస్య

- జంక్‌ఫుడ్, ఇతర పదార్థాలతో ఆరోగ్యానికి హాని
- కేంద్ర ఆరోగ్య హెచ్చరికల జాబితాలో సమోసా, జిలేబీ
- దుకాణాల వద్ద బోర్డుల ఏర్పాటుకు చర్యలు

(ఎంవీపీ కాలనీ, ఆంధ్రజ్యోతి)

మనం తీసుకునే ఆహారంలో భాగమైన సమోసా, జిలేబీ, గులాబ్‌జామ్‌తో పాటు జంక్‌ఫుడ్ ఆరోగ్యానికి హాని చేస్తాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇలాంటి పదార్థాలను విక్రయించే దుకాణాల వద్ద వాటిని తరచూ తీసుకోవడం ద్వారా కలిగే నష్టాలను వివరించేలా బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించింది.

ఒక సమోసాలో ఎంత శాతం నూనె, కొవ్వు పదార్థాలు ఉంటాయి. జిలేబీలో నూనె, చక్కెర ఎంత పరిమాణంలో ఉన్నాయో సూచిక బోర్డులు పెట్టాలని సూచించింది. ఒక గులాబ్ జామూన్‌లో ఐదు టీస్పూన్ల చక్కెర ఉంటుందన్న విషయం చాలామందికి తెలీదు. కనీసం ఇలాంటి బోర్డు పెడితే వాటిని తీసుకునే ముందు ప్రజలంతా ఒక్క క్షణం ఆలోచిస్తారన్నది కేంద్రం భావన. అప్పటికి తినేసినా, మరోసారి వెనుకాడతారని అంచనా. పని ఒత్తిడి, సమ యం లేకపోవడం, నివాసాలకు దూరంగా పనిచేయడం తదితర కారణాలతో యువత సాధారణ భోజనం కంటే నూనెలో వేయించిన చిరుతిండ్లపై ఆధారపడుతున్నారు. టీ, కాఫీ వంటివి ఎక్కువగా తాగుతూ సమోసాల్లాంటివి తెగ లాగించేస్తున్నారు.



నిషేధం కాదు

సంప్రదాయ వారసత్వంగా వినియోగిస్తున్న ఆహార పదార్థాలపై ఇది నిషేధంగా కొందరు భావిస్తున్నారు. అయితే ఇది నిషేధం కాదని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఆయా ఆహార పదార్థాలు ఎక్కడైనా విక్రయించవచ్చు. వాటిని తరచూ తినడం వల్ల ఆరోగ్య పరంగా ఏం జరుగుతుందో అవగాహన కల్పించడమే లక్ష్యంగా పేర్కొంది. రానున్న కొద్దినెలల్లో దేశంలోని అన్ని నగరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించింది.

ఎందుకిలా

ఓ సర్వే ప్రకారం పట్టణాల్లో నివసిస్తున్న ప్రతి ఐదుగురిలో ఒకరు అధిక బరువుతో బాధపడుతున్నారు. మహానగరం విశాఖలో చిరుతిండికి కొదువ లేదు. ఏ మూల చూసినా వీటిని విక్రయించే దుకాణాలు కోకొల్లలు. రోజువారీ చిరుతిళ్లలో ఎంత కొవ్వు, చక్కెర ఉంటుందో తెలియజేసే సూచిక బోర్డులను ఆయా దుకాణాల వద్ద ఉంచడంతో మెల్లమెల్లగా ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. 2050 నాటికి భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఊబకాయ కేంద్రంగా మారే ప్రమాదం ఉందని లాన్సెట్ జర్నల్ నివేదిక పేర్కొంది.

ఏం చేయాలి

ఆహార పదార్థాల విక్రయశాలల వద్ద హెచ్చరిక పోస్టర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆయా పదార్థాల్లో చక్కెర, కొవ్వు, ట్రాన్స్‌ఫ్యాట్ వంటి వాటిపై స్పష్టమైన సమాచారం ఉండాలి. తరచూ ఈ ఆహారం స్వీకరించడం వల్ల వచ్చే నష్టాలను ప్రస్తావించాలి



హెచ్చరిక బోర్డులు తప్పనిసరి

పబ్లిక్ ప్రదేశాలు, చిరుతిళ్ల విక్రయించే ప్రాంతాల్లో ఆయా పదార్థాలు తినడం వలనే కలిగే నష్టాలను వివరించే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులపై పోరాటానికి దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. 2050 నాటికి మన దేశంలో 44.9 కోట్లకుపైగా భారతీయులు అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడతారని అంచనా. ప్రస్తుతం అమెరికా ప్రథమ స్థానంలో ఉంది. మన దేశంలో ముందుగా నాగ్‌పూర్‌లో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్, నాగ్‌పూర్)లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు.

రుచికరమైన సమోసా... ఓ నిజం.

సాధారణ పరిమాణంలోని సమోసాలో 35 శాతం కార్బోహైడ్రేట్లు, ఐదు శాతం ప్రొటీన్, 60 శాతం కొవ్వు ఉంటుంది. పూర్తిగా నూనెలో మునిగే విధంగా వేయించడం వల్ల అధికరుచిని కలిగి ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవన శైలి కావాలనుకునేవారు, బరువును అదుపులో ఉంచుకోవాలని భావించే వారికి సమోసా అనువైనది కాదు.

సమన్వయంతో 'ప్రాజెక్టు సారథి' అమలు

- నగరంలో ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం
- సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్
- త్వరలో నగరమంతటా అమలు: సీపీ శంఖబ్రత బాగ్చి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 'ప్రాజెక్ట్ సారథి' ద్వారా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ (ఐటీఎంఎస్-ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను ఇప్పటికే ప్రవేశపెట్టినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో 'ప్రాజెక్టు సారథి' అమలుపై విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర పోలీసు అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టు సారథి కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో అమలు చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు సారథి అమలుకు సంబంధించిన దశలను కమిషనర్ వివరించారు. మొదటి దశగా ఆవిష్కరణ పూర్తయిందని, రెండో దశగా ఫీల్డ్ పైలట్ ఆరు సంస్థల ద్వారా విజయవంతంగా నిర్వహించామని, మూడో దశలో డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎంపీ ఎం.శ్రీభరత్ సూచనల మేరకు ఐటీఎంఎస్ పైలట్ ప్రాజెక్టు కింద ఐదు ప్రాంతాల్లో ఐదు సంస్థల ద్వారా అమలు చేస్తున్నామన్నారు.

బృహస్పతి టెక్నాలజీస్, హైదరాబాద్ - సంపత్ వినాయక గుడి జంక్షన్, మెటా ఫ్యూషన్ టెక్నాలజీ, నోయిడా-ఊర్వశి జంక్షన్, ద్వారకా నగర్ ఆర్టీసీ కాంపెక్స్., డాటా కార్స్, బెంగళూరు-ఆర్ అండ్‌బీజంక్షన్, పాస్‌పోర్టు ఆఫీస్.., ఎన్‌ఈసీ నోయిడా-గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్సు., సీఎంఎస్ కంప్యూటర్స్ లిమిటెడ్, ముంబై -ఎండాడ జంక్షన్, విమ్స్ హాస్పిటల్, ఓల్డ్ డెయిరీ ఫార్మ్ ప్రాంతాల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)తో పాటు ఏఎన్‌పీఆర్ (ఆటోమేటివ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్), ఆర్ఎల్‌వీడీ (రెడ్ లైట్ వైలేషన్ డిటెక్షన్) వ్యవస్థలను ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. పూర్తి స్థాయిలో ఐటీఎంస్ అమలు చేస్తే గణనీయమైన ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం కంపెనీల ప్రతినిధులు ప్రాజెక్టు సారథి ద్వారా నమోదైన వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో నివేదికను అధికారులకు వివరించగా, సదరు కంపెనీలు పొందుపరిచిన డీపీఆర్‌ను పరిశీలించి ఐటీఎంఎస్ ద్వారా మరింత కచ్చితంగా శాంతిభద్రతలను కాపాడేందుకు ఉపయోగపడే కొన్ని అదనపు ఎలిమెంట్స్ సూచిస్తూ, ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) టెండర్‌ను పిలిచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు, సీపీకి కమిషనర్ సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న అధికారులు

నగరమంతటా అమలు చేస్తాం

అనంతరం పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు, వాహనాల పర్యవేక్షణకు ప్రాజెక్టు సారథి దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే నగరమంతా అమలుచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నెల రోజులు వాహనాల నంబరు ప్లేట్ల గుర్తింపు, రెడ్ లైట్ ఉల్లంఘనలు తదితర వివరాలను సమీక్షించి, ఫలితాల ఆధారంగా నగరం మొత్తం అమలు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పీవీ సత్యనారాయణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ అదనపు కమిషనర్, పోలీసులు, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ సీవీవోగా రామకృష్ణ ప్రసాద్

విశాఖపట్నం,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(సీవీఓ)గా విశ్రాంత ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. గతంలో ఆగస్టు 2024 నుంచి జూలై 2025 వరకు సీవీఓగా పనిచేసిన ఆయనను ఉద్యోగ విరమణానంతరం ప్రభుత్వం ఏడాది పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.



బాధ్యతలు చేపట్టిన సీవీవో రామకృష్ణ ప్రసాద్

జిల్లాకు 642 కొత్త ఈపోస్ యంత్రాలు



డీలర్లకు కొత్త ఈపోస్ మిషన్లు అందజేస్తున్న డీఎస్‌వో భాస్కర్

విశాఖపట్నం,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు ప్రభుత్వం కొత్త ఈపోస్ యంత్రాలు సరఫరా చేసింది. జిల్లాలోని 642 డిపోలకు యంత్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోపంపిణీ ప్రారంభించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ గురువారం తన కార్యాలయంలో పలువురు డీలర్లకు కొత్త ఈపోస్ యంత్రాలు అందజేశారు. ఇప్పటివరకు డీలర్ల వద్ద ఉన్న పరికరాలు తిరిగి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. కొత్తగా ముద్రించిన స్మార్ట్ రైస్‌కార్డులపై ఉన్న బార్‌కోడ్ స్కాన్ చేసి సరకులు అందించేందుకు వీలుగా ఈపోస్ యంత్రాలను రూపొందించారన్నారు.

క్రైం... crime news

బైకులు ఢీ: ఒకరి మృతి



చీపురుపల్లి సతీశ్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన అయ్యప్పనగర్ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామానికి చెందిన చీపురుపల్లి సతీశ్ (44) పెందుర్తిలోని కొరియర్ సంస్థలో పనిచేస్తూ మండలంలోని నాయుడుతోటలో నివాసముంటున్నాడు. విధుల్లో భాగంగా గురువారం తన ద్విచక్ర వాహనంపై ఆనందపురం వెళ్తుండగా పెందుర్తి అయ్యప్పనగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన సతీశ్ తలకు తీవ్ర గాయమైంది. స్పందించిన స్థానికులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో వైద్యులు కళ్లను సేకరించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



చందు మృతదేహం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాలోని రాయగడ జిల్లా సిరిజ్‌హోళీ గ్రామానికి చెందిన సింగపూర్ చందు (19) విశాఖ నుంచి కోయంబత్తూర్ జనరల్ టికెట్ తీసుకొని రైలులో ప్రయాణిస్తున్నాడు. దువ్వాడ రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారమ్-1కు సమీపంలో గురువారం రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిన చొక్కాకుల

విశాఖపట్నం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు గురువారం బీజేపీలో చేరారు. అనకాపల్లి జిల్లా పెంటకోట కన్వెన్షన్ హాల్లో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ వెంకటరావుకు కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పైడి వేణుగోపాల్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కేతిరెడ్డి సురేంద్రమోహన్, రెడ్డి పావని తదితరులు పాల్గొన్నారు.



వెంకటరావుకు కండువావేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

జాతీయ అథ్లెటిక్స్ టోర్నీకి నగర క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ నుంచి 34 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించనున్నారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. ఈనెల 23 నుంచి గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా జరగనున్న టోర్నీలో బాలుర విభాగంలో 21 మంది, బాలికల విభాగంలో 13 మంది పాల్గొంటారన్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంవీ పవన్ కార్తీక్, మెంటర్ ఏఎస్‌జీ కిరణ్, సి.రామస్వామి, ఇతర ప్రతినిధులు క్రీడాకారులను అభినందించారు.

80 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మద్యంతో ఉన్న ఓ వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. పెదవాల్తేరు గాంధీ విగ్రహం కూడలి వద్ద ఓ వ్యక్తి 80 సీసాలతో పారిపోవడానికి ప్రయత్నించగా, ఎస్ఐ ధనుంజయనాయుడు వెంబడించి పట్టుకున్నారు. నిందితుడు పాలికలవారి వీధికి చెందిన బొర్రా సతీష్ (40)గా గుర్తించారు. నిందితుడి వివిధ బ్రాండ్ల మద్యం ఉందని పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తుండడంతో అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా శేఖర్



పీసీ శేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా (విశాఖ జోన్) సైనిక సంక్షేమ అధికారిగా రిటైర్డ్ వింగ్ కమాండర్ పీసీ శేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ సైనికులు, యుద్ధంలో మరణించిన ఉద్యోగుల భార్యలు, వారిపై ఆధారపడిన వారికి కేంద్రీయ సైనిక బోర్డు, రాజ్య సైనిక బోర్డులతో సమన్వయం చేసుకుని సహాయ సహకారాలు అందిస్తారు.

వీడియోకాల్‌లో ప్రేమికురాలితో వాగ్వాదం...ప్రేమికుడి ఆత్మహత్య

- గొంతుకోసుకుని, మిద్దె పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్న వైనం
- చెన్నై కోయంబేడులో ఘటన
- మృతుడు విశాఖ వాసి

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలితో వీడియోకాల్ మాట్లాడుతుండగా జరిగిన వాగ్వాదంతో గొంతుకోసుకుని, మిద్దె పైనుంచి దూకి ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్నైలో జరిగిన ఈ ఘటనలో మృతిచెందిన యువకుడు విశాఖ వాసి. ప్రియురాలు హైదరాబాద్ వాసి. విశాఖపట్నానికి చెందిన నవీన్ (20) అక్కడే ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా, అతడి స్నేహి తులు విఘ్నేష్, హరి చెన్నైలో చదువుకుంటూ కోయంబేడులోని అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఈ నెల 8న తన తల్లి, స్నేహితురాలితో కలిసి తిరువణ్ణామలై ఆలయ దర్శనం కోసం నవీన్ చెన్నైకు వచ్చి, బుధవారం కోయంబేడులోని స్నేహితుల అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. అక్కడే రాత్రి బస చేశాడు. గురువారం వేకువజామున 3.45 గంటల సమయంలో నవీన్ ఒంటరిగా కూర్చొని ఉండడాన్ని విఘ్నేష్ గమనించి ప్రశ్నించగా ఏమీ లేదని చెప్పి, కొంత సమయం తర్వాత మిద్దెపైకి వెళ్లాడు.అనంతరం విఘ్నేష్‌కు ఫోన్ చేసి 'నాకు ఈ ప్రపంచంలో జీవించడానికి ఇష్టంలేదు. నా కుటుంబాన్ని నీవే చూసుకోవాలి' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన విఘ్నేష్ వెంటనే మిద్దెపైకి వెళ్లి చూడగా, కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసు విచారణలో...హైదరాబాద్‌కు చెందిన యువతిని నవీన్ ప్రేమిస్తున్నాడని, వీడియోకాల్‌లో మాట్లాడుతూ గొడవపడ్డారని తేలింది. ఆగ్రహించిన నవీన్ గొంతుకోసుకున్నాడని, అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి మిద్దె పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడని వెలడైంది. పోలీసులు నవీన్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు.